


# శివసూర్య

SHIVA SURYA TELUGU DAILY
RNI APTEL : 2023/88704
తెలుగు దిన పత్రిక




కర్నూలు సంపుటి : 04, సంచిక : 22 ఛీఫ్ ఎడిటర్.. పేజిలు : 08, వెల రూ. 2రూ/ శుక్రవారం - 02 - అక్టోంబర్ - 2026
Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad




## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించే జీవోల రద్దు

- ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు.. 34% బీసీ రిజర్వేషన్లు రద్దు!
- మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని హైకోర్టు స్పష్టీకరణ
- ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- వార్డుల పునర్విభజన, ఇతర అంశాలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం

# బీసీలకు అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే

### స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు

- ★ రేపల్లె ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టత
- ★ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రేపే సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్తున్నట్లు వెల్లడి
- ★ బాపట్ల జిల్లాలో సూర్యలంక బీచ్‌ను గోవా తరహాలో అంతర్జాతీయ పర్యాటక ల్యాండ్‌మార్క్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటన
- ★ రాష్ట్రంలో రూ. 1 లక్ష కోట్లతో రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాను కలుపుకుని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు శ్రీకారం



బాపట్ల జిల్లా రేపల్లె: బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్ధికంగా అండగా నిలిచింది... నిలిచేది తామేనని ముఖ్యమమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. బీసీలకు చేయూతను అందించే విషయంలో ఎక్కడా రాజీ పడబోమని తేల్చి చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును మిగతా 2 లో

## లోకేశ్‌పై రాజ్‌దీప్ సర్దేశాయ్ ప్రశంసలు..

### ఇతర నేతలు ఆదర్శంగా తీసుకోవాలని సూచన




- కొచ్చిలో జరిగిన ఓ కార్యక్రమంలో లోకేశ్‌ను ఇంటర్వ్యూ చేసిన రాజ్‌దీప్
- స్క్రిప్ట్ లేకుండా కఠిన ప్రశ్నలకు సూటిగా బదులిచ్చారని కొనియాడిన వైనం
- చాలా స్పష్టంగా సమాధానాలు ఇచ్చారని ప్రశంస

అమరావతి: సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్.. ఆంధ్రప్రదేశ్ మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్‌పై మిగతా 2 లో




## ఆపరేషన్ త్రిశూల్' ప్రదర్శన స్టాల్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

- జిల్లాలో గంజాయి కట్టడికి 661 ఈగిల్ క్లబ్‌ల ఏర్పాటు, 287 కిలోల గంజాయి సీజ్ చేసినట్లు వెల్లడించిన
- జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్
- మహిళలపై నేరాలు 22.55%, పోక్సో కేసులు 50%, హెల్మెట్
- నిబంధనలతో రోడ్డు ప్రమాద మరణాలు 12% మేర తగ్గింపు
- బాపట్ల పోలీస్ శాఖ చేపట్టిన వినూత్న చర్యలు, '



## మమతా వర్గానికి సుప్రీంలో చుక్కెదురు... రూ.804 కోట్ల ఖాతాలపై పిటిషన్ కొట్టివేత

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. స్తంభింపజేసిన నాలుగు బ్యాంకు ఖాతాలను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం తోసిపుచ్చింది. ఈ ఖాతాల్లో సుమారు రూ. 804 కోట్ల మేర నిధులు ఉన్నట్లు సమాచారం. మిగతా 2 లో

- స్తంభింపజేసిన టీఎంసీ ఖాతాలపై మమతా వర్గం పిటిషన్ కొట్టివేత
- నాలుగు బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 804 కోట్ల నిధులపై విచారణ
- హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

## లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

### యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ

- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
- లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్య
- సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని
- భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ



ఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో మిగతా 2 లో

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

### సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!

- రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ సవాల్
- రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు డిమాండ్
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరిన కేటీఆర్
- తప్పు తేలితే శిక్షకు సిద్ధమన్న కేటీఆర్
- ప్రభుత్వ హామీలపై పోరాటం కొనసాగిస్తామన్న కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి మిగతా 2 లో




## '9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్న భారతీయుడు'.. కెప్టెన్ స్మిత్‌పై మోదీ ప్రశంసలు

- స్మిత్ అసాధారణమైన ధైర్యాన్ని ప్రదర్శించారని కితాబు
- ఇప్పటికే స్మిత్‌ను 'హీరో'గా అభివర్ణించిన మోదీ
- తీవ్ర విషాదాన్ని ఆపారంటూ నెతన్యాహూ సైతం ప్రశంసలు
- ప్రస్తుతం సౌదీలో చికిత్స పొందుతున్న స్మిత్
- ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అధికారుల వెల్లడి

# విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపిస్తున్నాం

### చేనేత కార్మికులకు, చేతివృత్తులకు ఇది ప్రధాన కేంద్రం

- వస్త్ర పరిశ్రమకు సిరిసిల్ల అడ్డా
- అగ్గిపెట్టెలో చీరను మడతపెట్టే నైపుణ్యం ఇక్కడి నేత కార్మికుల ప్రత్యేకత
- "మనిషి నాగరికత వస్త్రంతో ప్రారంభమైంది
- ప్రమాదవశాత్తు కార్మికులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలను ఆదుకోవడానికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించే ప్రత్యేక విధానం అమలు చేస్తున్నాం



హైదరాబాద్: ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన -- ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. సిరిసిల్ల నేతన్నల ప్రాశస్త్యాన్ని మిగతా 2 లో

## బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేసిన కిషన్ రెడ్డి




- ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఈసీపై దాడి చేస్తోందని ఆరోపణ
- హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- కాంగ్రెస్ దొంగ ఓట్లను చేర్పించే ప్రయత్నం చేస్తోందని విమర్శ
- బీఆర్ఎస్‌తో పొత్తు, ఖైరతాబాద్‌లో బీజేపీ పోటీపై కిషన్ రెడ్డి ఏమన్నారంటే?

హైదరాబాద్: ఖైరతాబాద్ లో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ నాయకుడు జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ పొత్తుపై జరుగుతున్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యామని,

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ..

## అవ్వాతాతల ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు: ఈబిజీ గోవింద్ గౌడ్



శివ సూర్య న్యూస్ అక్టోబర్ 1 :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక "ఎన్టీఆర్ భరోసా" పథకం ద్వారా అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ప్రతి నెలా గౌరవప్రదంగా పెన్షన్లు అందిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది.ఆలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి శ్రీమతి వైకుంఠం జ్యోతి గారి ఆదేశాల మేరకు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీ ఈబీజీ గోవింద్



గౌడ్ గారి ఆధ్వర్యంలో హొళగుంద మండలం ఈర్లకట్ట కాలనీతో పాటు బుడగజంగాల కాలనీ పరిసర ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు ఈబీజీ గోవింద్ గౌడ్ గారు, పార్టీ నాయకులు మరియు సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పెన్షన్లు అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు యారిస్వామి గారు, టీడీపీ మండల కో-కన్వీనర్ జాకీర్ మాజీ సర్పంచ్ గాదిలింగ గారు, బుడగజంగాల రామాంజి గారు, టీడీపీ మండల మైనార్టీ అధ్యక్షులు ముల్లా మొయిన్ గారు, , సురేష్ గారు, అలాగే సచివాలయ సిబ్బంది నాయక్ గారు, తదితరులు పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, ప్రతి నెలా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఇంటి వద్దకే పెన్షన్ అందుతున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, ఆలూరు నియోజకవర్గ అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీమతి వైకుంఠం జ్యోతి గారికి కృతజ్ఞతలు తెలిపారు."ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం... ప్రతి ఇంటికీ భరోసా, ప్రతి కుటుంబానికి అండగా నిలవడమే లక్ష్యంగా ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా అవ్వాతాతలు, అర్హులైన లబ్ధిదారుల జీవితాల్లో భరోసా నింపుతున్నాం" అని నాయకులు పేర్కొన్నారు.

## వైభవంగా నవరత్న రథంపై ప్రహ్లాదుని విహారం



మంత్రాలయం శివ సూర్య: పవిత్ర పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో గురువారం రోజు స్వామివారికి అత్యంత ప్రీతికరమైన రోజు కావడంతో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు.ఉదయం నుండి మూల బృందావనానికి అర్చకులు శేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించి, అనంతరం బంగారు కవచాలతో, వివిధ రకాల సుగంధ పుష్పాలతో బృందావనాన్ని అత్యంత సుందరంగా అలంకరించారు. మృతిక బృందావనానికి బంగారు పల్లకిలో ప్రత్యేక పూజలు చేశారు.స్వామివారికి ప్రీతికరమైన సర్వసేవ, పూర్ణ సేవ, ఉత్సవ రాయల పాదపూజ, అర్చన, సైత అష్టోదకం తదితర సేవలను భక్తుల సమక్షంలో నిర్వహించారు. సేవల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.రాత్రి వేళలో ఉత్సవమూర్తి అయిన ప్రహ్లాదుడిని నవరత్న రథంపై అలంకరించి ఊరేగించారు. అంతకు ముందు చెక్క రథం, బంగారు రథం, వెండి రథోత్సవాలు నిర్వహించారు. అశేష జనవాహిని నడుమ, మంగళ వాయిద్యాలు, అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య శ్రీ మఠం ప్రాకారం చుట్టూ ప్రహ్లాదుని రథాన్ని తిప్పారు. భక్తుల జయజయధ్వానాల మధ్య రథోత్సవం కన్నుల పండుగగా సాగింది.

## ఎమ్మెల్యే ఎంజీఆర్ కి వీబీజీ రాం-జీ క్షేత్ర సహాయకుల వినతి



మెళియాపుట్టి, శివ సూర్య, అక్టోబర్ 01: వీబీజీ రాం-జీ (ఎదీ+ =ూవీ-+) క్షేత్ర సహాయకుల సమస్యలపై పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కి గురువారం పలువురు క్షేత్ర సహాయకులు వినతి పత్రం అందించారు.జీతభత్యాల పెంపు, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసి, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, అసెంబ్లీలో సైతం ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై ప్రస్తావించాలని కోరారు. గత 20 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో తీవ్ర అవస్థలు పడుతున్నామని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన వీబీజీ రాం-జీలో పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షేత్ర సహాయకుల సంఘం నాయకుడు బైరాగి నాయుడు, మెళియాపుట్టి మండల క్షేత్ర సహాయకుల సంఘం అధ్యక్షుడు శ్రీరాం చాణిక్య, ఉపాధ్యక్షుడు జగదీశ్వరరావు, అదపాక ల మోహన్ రావు, కొవ్వూరు సింహాచలం, సిరిపురం షణ్ముఖరావు, ఊర్లాన షణ్ముఖరావు, లింగరాజు, బిజీయా పండి తదితరులు పాల్గొన్నారు.

## బూదూరు గ్రామాభివృద్ధికి రూ.30 లక్షలు - పనులకు భూమిపూజ



మంత్రాలయం: మండలంలోని బూదూరు గ్రామ అభివృద్ధికి రూ.30 లక్షలతో చేపట్టనున్న పనులకు మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి గురువారం భూమిపూజ నిర్వహించారు. పిఎంఏ జీవై పథకం కింద రూ.20 లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, పల్లె పండుగ 3.0 కింద విడుదలైన రూ.10 లక్షల గ్రాంట్ తో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, నిధులు మంజూరు చేసి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. బూదూరులో సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామంలో మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయన్నారు.నిధులు మంజూరు చేయడంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ఎంపీడీవో నూర్జహాన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు, మాజీ జెడ్పీటీసీ ఆర్.లక్ష్మయ్య, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, వగరూరు పవన్ కుమార్, క్లస్టర్ ఇన్చార్జ్ పవన్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇటీవలే అర్నాబ్ తుఫాన్ తో ఇల్లు కూలిన బాధితులకు ఆర్థిక సహాయం అందించిన

---ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



మెళియాపుట్టి, శివ సూర్య, అక్టోబర్ 01: ఇటీవల అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా పాతపట్నం మండలం బడ్డుమర్రి గ్రామపంచాయతీ పరిధి కొండ భీమునిపేట గ్రామంలో ఇల్లు కూలిపోయి నష్టపోయిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పరామర్శించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం మంజూరు చేసిన సహాయాన్ని బాధిత కుటుంబాలకు అందజేశారు. కూటమి



ప్రభుత్వం తరపున నిత్యావసర సరుకులతో పాటు రూ.3,000 నగదు సహాయాన్ని అందజేసి వారికి భరోసా కల్పించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం అందించే సహాయాన్ని సకాలంలో చేరవేస్తూ, ప్రతి ఒక్కరికి అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కష్టకాలంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలతో ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మండలంలో అక్టోబర్ 3 న కేంద్రమంత్రి, ఎమ్మెల్యే పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



మెళియాపుట్టి, శివ సూర్య అక్టోబర్ 01: ఈనెల మూడవ తేదీ అనగా శనివారం నాడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు,పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు నియోజవర్గంలో పర్యటించనున్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం,శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారని పార్టీ కార్యాలయం నుంచి పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. కావున కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం కోరారు.

## 2 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ఎంజీఆర్





మెళియాపుట్టి, శివ సూర్య అక్టోబర్ 01: పాతపట్నం శాసనసభ్యులు అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు అభివృద్ధి పనులు ప్రారంభించారు. పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా పాతపట్నం మండలం గంగువాడ గ్రామపంచాయతీలో సుమారు రూ.2 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...., గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. రహదారుల నిర్మాణం ద్వారా ప్రజల రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు గ్రామీణ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. పల్లెల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వెంకటరమణ, టిడిపి మండలాధ్యక్షుడు పైల బాబ్జి, పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎస్సై ప్రత్యేక చొరవతో క్షేమంగా ఇంటికి చేరిన సవర కామయ్య



మెళియాపుట్టి, శివ సూర్య, అక్టోబర్ 01: మెళియాపుట్టి మండలం సవర చీపురుపల్లి గ్రామానికి చెందిన సవర కామయ్య (43) గత నెల 22వ తేదీ నుండి తెలంగాణ రాష్ట్రం, తుమ్మకుంటలో కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం మెళియాపుట్టి ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ ప్రత్యేక చొరవతో ఒక నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన వ్యక్తి అదృశ్యమయ్యారనే విషయాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని తక్షణమే స్పందించారని ,తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పోలీసు అధికారులతో సమన్వయం చేస్తూ, సంబంధిత స్టేషన్లకు సమాచారం అందించి ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పిస్తూ, నిరంతరం చర్యలు కొనసాగించిన తీరుపై కుటుంబ సభ్యులు ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల ప్రత్యేక చొరవ, రెండు రాష్ట్రాల అధికారుల సమన్వయం, ప్రజల సహకారంతో సవర కామయ్య గురువారం క్షేమంగా కుటుంబ సభ్యుల వద్దకు చేరారు. కష్ట సమయంలో అండగా నిలిచిన గిరిజన, దళిత, ప్రజా, వామపక్ష సంఘాలకు, మీడియా మిత్రులకు, పోలీసు అధికారులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొన్న శాసనసభ్యులు మామిడి గోవిందరావు

మెళియాపుట్టి , శివ సూర్య, అక్టోబర్ 0 1: పాతపట్నం శాసనసభ్యులు అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్



మామిడి గోవిందరావు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాతపట్నం మండలం గంగువాడ గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు పంపిణీ చేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..... వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఆర్థిక



భరోసా కల్పించడంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజా సంక్షేమం, పేదల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంజీఆర్ తో పాటు జడ్పీ సీఈఓ వెంకటరమణ, మండల స్థాయి అధికారులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పైల బాబ్జి, పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అర్నాబ్ తుఫాన్ లో ఇల్లు కూలిన బాధితులకు నిత్యవసర వస్తువులు, ఆర్థిక సహాయం



మెళియాపుట్టి, శివ సూర్య, అక్టోబర్ 01: ఇటీవల అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా మెళియాపుట్టి మండలం పడ్డ, గంగరాజుపురం, చాపర, గొడ్డ, నేల గొంతు గ్రామంలో ఇల్లు కూలిపోయి నష్టపోయిన బాధిత కుటుంబాలను గురువారం రెవెన్యూ సిబ్బంది నిత్యవసర సరుకులు,



ప్రభుత్వం మంజూరు చేసిన సహాయాన్ని బాధిత కుటుంబాలకు అందజేశారు. ప్రభుత్వం తరపున నిత్యావసర సరుకులతో పాటు కొంత నగదు సహాయాన్ని అందజేసి వారికి భరోసా కల్పించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం అందించే సహాయాన్ని సకాలంలో రెవెన్యూ సిబ్బంది అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కే రాము, ఆర్ ఐ జగన్ మోహన్, రెవిన్యూ సిబ్బంది, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నంబాల వెంకటరావు, చక్రి, శంకర్, బుజ్జి, బాధ్యత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## సినిమా రచయితగా గద్వాల్ రవీందర్.



గద్వాల(శివసూర్య )శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వేంకటేశ్వర స్వామి మహత్యం ఆడియో ఆవిష్కరణ ఘనంగా హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో శ్రీ పెద్దిస్ క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న "శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వేంకటేశ్వర స్వామి మహత్యం" చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగింది.ఈ చిత్రానికి రచయిత గా మన ఆల్వాల్ రవీందర్, కు అవకాశం కల్పించారు.ఈ



సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ,నడిగడ్డ గద్వాల్ ప్రాంత శీ కళలకు, కవులకు పుట్టినిల్లుగా దశబ్దాలుగా వర్ధిల్లుతుంది.ఈ ప్రాంత వాసిగా ( రవీందర్ ఆలశీపూర్ తాలూకా శాంతినగర్ వాసి.) రచయిత గా సినిమాకు పని చేయడం ఏడుకొండల వెంకటదేవుని ఆశీర్వాదంగా,గొప్పవరంగా భావిస్తున్నానని అన్నారు.కార్యక్రమం లో స్వామివారి ఆలయాన్ని తలపించేలా ఆహ్లాదకరమైన భక్తి వాతావరణం నెలకొంది. స్వామివారి కీర్తనలు, భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలతో బిర్లా ఆడిటోరియం భక్తి భావంతో కళకళలాడింది. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు, చిత్ర బృంద సభ్యులు, అభిమానులు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ ఈ వేడుకను మరింత ప్రత్యేకంగా నిలిపారు.స్వామివారి పాటలతో సాగిన సంగీత కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆధ్యాత్మికత, భక్తి, కళాత్మకత కలగలిసిన ఈ ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంది.ఈ చిత్రాన్ని శ్రీ పెద్దిస్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. చిత్రానికి దర్శకత్వం: పెద్ది ఖ. ఈశ్వర్, సంగీతం: కిషన్ కవాడియా, రచన: రవీందర్ అల్వాల.చిత్ర బృందం మాట్లాడుతూ, శ్రీ వేంకటేశ్వర స్వామివారి మహత్యాన్ని, భక్తి భావాన్ని ప్రేక్షకులకు అందించే విధంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని, ఆడియోకు లభించిన స్పందన తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు.

# అంతర్జాతీయ వేదికపై మరోసారి.. అరుదైన ఘనత సాధించిన రష్మిక!



పేరుకే కన్నడ బ్యూటీ.. నేడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న రష్మిక మందన్న గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు.. అందం అభినయంతో కాదు నటనతో ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది ఈ చిన్నది.. నేడు పాన్ ఇండియా స్టార్ హీరోయిన్గా చలామణి అవుతున్న ఈమె.. గత మూడు సంవత్సరాలుగా వరుస చిత్రాలతో.. ఊహించని విజయాలతో.. బాక్సాఫీస్ కలెక్షన్స్ తో స్టార్ హీరోల రికార్డులను కూడా బ్రేక్ చేస్తోంది అనడంలో సందేహం లేదు.

## అంతర్జాతీయ వేదికపై రెండవసారి..

పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా, సికందర్ , ది గర్ల్ ఫ్రెండ్, కుబేర ఇలా వరుస పెట్టి సినిమాలు చేస్తూ బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్ వసూలు చేస్తూ.. బాక్సాఫీస్ క్వీన్ గా పేరు సొంతం చేసుకుంది రష్మిక మందన్న . ఇదిలా ఉండగా అటు కెరియర్ పరంగా బిజీగా మారిన ఈమె.. ఇటు వ్యక్తిగతంగా తన ప్రాణ స్నేహితుడైన విజయ్ దేవరకొండ తో ఏడడుగులు కూడా వేసింది. ఇక ఇప్పుడు వివాహితగా మారిన తర్వాత తన భర్త విజయ్ దేవరకొండ తో కలిసి చేస్తున్న తొలి చిత్రం రణబాలి. ఇప్పటికే ఈ సినిమాలోని రాయలసీమ ప్రాంతానికి సంబంధించి షూటింగ్ షెడ్యూల్ ను పూర్తి చేసుకున్నారు. మరొకవైపు మైసా అనే సినిమాలో కూడా నటిస్తోంది రష్మిక . ఇలా కెరియర్ పరంగా వరుస చిత్రాలతో బిజీగా మారిన ఈమె తాజాగా మరోసారి అంతర్జాతీయ వేదికపై కనిపించనుంది. అంతేకాదు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న మొట్టమొదటి భారతీయ సినీ నటిగా పేరు కూడా సొంతం చేసుకుంది రష్మిక.

## ఇండియా స్వీట్ హార్ట్ గా రష్మిక..

పూర్తి వివరాల్లోకి వెళితే.. జపాన్ లోని టోక్యోలో మే 23వ తేదీన జరగనున్న " క్రంచీరోల్ యానిమే అవార్డ్స్ 2026"లో రష్మిక ప్రజెంటర్ గా వ్యవహరించబోతోంది. ఈ ప్రతిష్టాత్మక వేదికపై ఈమె రెండవసారి కనిపించడం గమనార్హం.. 2024 లోనే ఈమె ఈ అవార్డ్స్ వేడుకల్లో ప్రజెంటర్ గా సందడి చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరొకసారి ఈ అవకాశం అందుకోవడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు ఈ ప్రతిష్టాత్మక వేదికపై వరుసగా రెండుసార్లు అవార్డులు అందజేస్తున్న తొలి భారతీయ నటిగా రష్మిక చరిత్ర సృష్టించింది. పైగా పుష్ప సినిమాతో జపాన్ లో భారీ క్రేజ్ సంపాదించుకున్న ఈమెను క్రంచీరోల్ సంస్థ "ఇండియా స్వీట్ హార్ట్" గా అభివర్ణించింది.

## పుష్ప మూవీ తోనే సాధ్యం..

ఇకపోతే ఈ క్రెడిట్ మొత్తం పుష్ప సినిమాకే లభిస్తుందని అభిమానులు కూడా కామెంట్లు చేస్తున్నారు. ఎందుకంటే పుష్ప సినిమాలో శ్రీవల్లి పాత్రతో అందరినీ ఆకట్టుకుంది రష్మిక. జపాన్లో ఈ సినిమా విడుదల చేసినప్పుడు శ్రీవల్లి పాత్రకు అక్కడి జపాన్ ఆడియన్స్ ఫిదా అయిపోయారు. ఆమెకు విపరీతమైన ఫాలోయింగ్ కూడా వచ్చేసింది. ఈ నేపథ్యంలోనే అక్కడి సోషల్ మీడియా ఫాలోయింగ్ చూసి నిర్వాహకులు ఈమెను వరుసగా మళ్లీ ఆహ్వానించినట్లు తెలుస్తోంది . ఏది ఏమైనా భారతీయ నటీమణులు ఇలా గ్లోబల్ స్టార్లుగా ఎదుగుతున్నారు అనడానికి రష్మిక మరో ఉదాహరణగా నిలిచింది అని చెప్పవచ్చు. ఇప్పటికే ఆస్కార్ వేదికపై ప్రియాంక చోప్రా రెండవసారి కనిపించి సంచలనం సృష్టించింది.

# రియా బోల్డ్ డెనిమ్ లుక్ వైరల్





ఊహించనిది జరిగితే దానిని ఎదుర్కోవడమే ధైర్యవంతుని లక్షణం. అలాంటి ధైర్యం తనకు ఉందని నిరూపించింది రియా చక్రవర్తి. తూనీగ తూనీగ సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెట్టిన రియా చక్రవర్తి బాలీవుడ్ యువహీరో సుశాంత్ సింగ్ తో ప్రేమాయణం సాగించడం, డ్రగ్స్ స్కామ్, మనీలాండరింగ్లో తన పేరు వినిపించడం, అనంతరం సుశాంత్ ఆత్మహత్య వగైరా సంచలనాలు అయ్యాయి. ఈ కేసులో రియా చక్రవర్తి అరెస్టయి జైలులో కొన్ని నెలలపాటు ఉండాల్సి వచ్చింది. ప్రస్తుతం బెయిల్ పై బయటే ఉన్న రియా తిరిగి తన జీవితాన్ని కొత్త కోణంలో చూపించేందుకు చేయని ప్రయత్నం లేదు. రియా చక్రవర్తి తన మాజీ ప్రియుడు, నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ జూన్ 2020లో మరణించిన తర్వాత తనపై వచ్చిన అభియోగాలు క్లియర్ కావడానికి ముందు కొంతకాలం జ్యుడీషియల్ రిమాండ్‌లో కూడా ఉంది. దీనిపై అప్పట్లో హ్యూమన్స్ ఆఫ్ బాంబేతో మాట్లాడిన రియా, వీటన్నింటికీ ముందు తాను భ్రమలతో కూడుకున్న ఆశావాదిని అని తెలిపింది.

తాను ఎప్పుడూ తన పనిని ఆస్వాధించాలనుకుంటానని, ఎలాంటి లక్ష్యాలు లేకుండా ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలని కోరుకుంటానని రియా చక్రవర్తి అన్నారు. ఆరోపణల కారణంగా..దేశం మొత్తం నాపై ఎలాంటి అభిప్రాయాన్ని కలిగి ఉంటుందో, మంచి లేదా చెడును మరచిపోతుందని నేను కచ్చితంగా ఊహించలేను! నటిగా కూడా నా ఆశయం ఎప్పుడూ నంబర్ 1 కాదు.. నేను ఒక క్రాఫ్ట్‌గా నటనను ఆస్వాధించడం ప్రారంభించాను. దాని గురించి లక్ష్యాలు లేవు. జగరబోయేదానికి ఎవరూ నన్ను సిద్ధం చేయలేదు. వారు నన్ను.. చుడైల్, కాలా జాదు కర్నే వాలీ, నాగిన్ లాంటి పేర్లతో పిలుస్తారు.. కానీ నేను దేనినీ నిజంగా పట్టించుకోను. ఇలాంటివి ఇంతకుముందు నన్ను కలవరపెట్టేవి కానీ ఇప్పుడు కాదు! అని తెలిపింది. అయితే రియా తన జీవితాన్ని తిరిగి పొందాలంటే %-%క్షమించే మార్గం%-%లో వెళ్ళవలసిందిగా భావించానని, దాదాపు బలవంతంగా ఇది జరిగిందని చెప్పింది. జరిగి నదంతా క్షమించాలని నా హృద యంలో ఉంటుందని నేను అనుకోలేదు. కానీ నేను చాలా కాలంగా చాలా కోపంగా ఉన్నందున క్షమాగుణం సింపుల్ మార్గంగా మారింది. నాకు వచ్చిన కోపం అంతా గట్ సమస్యలు.. అసిడిటీ మాత్రమే. నేను దాదాపు మూడేళ్లపాటు ఎసిడిటీతో చాలా బాధపడ్డాను. క్షమాపణ ఒక్కటే ఆప్షన్‌గా మారింది. నేను దాదాపు క్షమాపణ మార్గంలోకి వెళ్ళవలసి వచ్చింది.. అని తెలిపింది. 2020లో సుశాంత్ మరణించిన తర్వాత, రియా అతడి ఆత్మహత్యకు ప్రేరేపించిందని ఆరోపణలు వచ్చాయి. మనీలాండరింగ్ ఆరోపణలపై రియాను ఆమె సోదరుడు షోక్‌ను కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రశ్నించింది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) కేసును స్వాధీనం చేసుకున్న తరువాత, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) సుశాంత్‌కు గంజాయి సరఫరా చేశారనే ఆరోపణతో రియాను ఆమె సోదరుడిని అరెస్టు చేసింది. అయితే సుశాంత్ డ్రగ్స్ వ్యసనానికి రియా ఆర్థిక సహాయం చేసిందనే ఎన్‌సిబి సిద్ధాంతాన్ని బాంబే హైకోర్టు తిరస్కరించింది. రియా వరుస ఫోటోషూట్లు: రియా చక్రవర్తి ఇటీవల గతాన్ని మరిచి యాక్టివ్ గా ఉంటోంది. సోషల్ మీడియాల్లో నిరంతరం తన లేటెస్ట్ ఫోటోషూట్లను షేర్ చేస్తూ అభిమానుల్లో ఉత్సాహం నింపుతోంది. ఒక వివాదం తర్వాత తనకు అవకాశాలిచ్చేవారు కరువయ్యారు. కానీ మొక్కవోని ధీక్షతో తన వంతు ప్రయత్నాలను ఆపడం లేదు. ఇటీవల సోషల్ మీడియాల్లో రియా గ్లామ్ ఫోటోగ్రాఫ్స్ వేగంగా వైరల్ అవుతున్నాయి. తాజా ఫోటోషూట్ లో రియా డెనిమ్స్ లో స్టన్నింగ్ లుక్ తో కనిపించింది. ఓవైపు డెనిమ్స్ ధరించినా ఇన్నర్ అందాలను ఎలివేట్ చేయడంలో రియా ఎక్కడా తగ్గలేదు. మెడలో గోల్డ్ పెండెంట్ చైన్ రియా అందాలను స్పైసప్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలోకి దూసుకెళుతున్నాయి.

# నభా నటేష్ అందాల తుఫాన్.. ఈసారి హాట్‌నెస్ పీక్‌లో!



తెలుగు తెరపై తనదైన ముద్ర వేసిన అందాల భామ నభా నటేష్, తాజాగా సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తోంది. బ్లాక్ కలర్ శారీలో తన హాట్ అందాలను ఆరబోస్తూ ఆమె ఇచ్చిన స్టిల్స్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. కొన్ని రోజుల తర్వాత రీ-ఎంట్రీ ఇచ్చిన ఈ 'ఇస్మార్ట్' పిల్లా, వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉండటమే కాకుండా.. గ్లామర్ డోస్ పెంచి అభిమానుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. అసలు ఆ ఫోటోల విశేషాలేంటో చూద్దాం.

## బ్లాక్ శారీలో నభా మెరుపులు.. వైరల్ అవుతున్న ఫోటోలు:

నభా నటేష్ అంటేనే ఒక ఎనర్జీ. సినిమాల్లోనే కాదు, సోషల్ మీడియాలో కూడా ఆమె చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ బ్లాక్ కలర్ శారీలో అదిరిపోయే ఫోటోషూట్ చేసింది. తన నడుము ఒంపులు, ఎద అందాలు హైలెట్ అయ్యేలా ఆమె ఇచ్చిన బోల్డ్ స్టిల్స్ చూసి నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. "బ్లాక్ బ్యూటీ అంటే నీవే నభా" అంటూ కామెంట్స్ సెక్షన్‌ను నింపేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి.

## నన్ను దోచుకుందువటే నుండి ఇస్మార్ట్ శంకర్ వరకు:

కన్నడ సోయగం అయిన నభా, 2018లో 'నన్ను దోచుకుందువటే' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఆ సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా, పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' ఆమె దశను మార్చేసింది. ఆ సినిమాలో తెలంగాణ యాసలో మాట్లాడుతూ, మాస్ లుక్‌లో నభా చేసిన హంగామా అంతా ఇంతా కాదు. ఇక ఆ ఒక్క సినిమాతో ఓవర్‌నైట్ స్టార్ అయిపోయిన ఈ బ్యూటీ, వరుసగా క్రేజీ ఆఫర్లను దక్కించుకుని తెలుగు ప్రేక్షకుల ఫేవరెట్ హీరోయిన్‌గా మారిపోయింది.

## ప్రమాదం నుంచి కోలుకుని.. అదిరిపోయే రీ-ఎంట్రీ:

కెరీర్ ఫుల్ స్వింగ్‌లో ఉన్న సమయంలోనే నభాకు ఒక చిన్న యాక్సిడెంట్ జరిగింది. దీనివల్ల ఆమె కొంతకాలం పాటు సినిమాలకు బ్రేక్ ఇచ్చి బెడ్ రెస్ట్ తీసుకోవాల్సి వచ్చింది. ఆ గ్యాప్ తర్వాత మళ్ళీ ఫుల్ ఎనర్జీతో రీ-ఎంట్రీ ఇచ్చింది. ఇక ఇటీవల ప్రియదర్శి సరసన 'డార్లింగ్' చిత్రంతో పలకరించినప్పటికీ, ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిలబడలేకపోయింది. అయినప్పటికీ నభా క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ప్రస్తుతం ఆమె చేతిలో మూడు భారీ ప్రాజెక్టులు ఉండటం విశేషం.

## స్వయంభు, నాగబంధంతో మళ్ళీ ఫామ్‌లోకి:



ప్రస్తుతం నభా నటేష్ 'స్వయంభు', 'నాగబంధం' మరియు 'ట్రైసన్ నాయుడు' వంటి విభిన్నమైన చిత్రాల్లో నటిస్తోంది. ఈ సినిమాలు ఆమె కెరీర్‌కు చాలా కీలకం కానున్నాయి. ముఖ్యంగా పీరియాడిక్ డ్రామాగా వస్తున్న స్వయంభుపై భారీ అంచనాలు ఉన్నాయి.ఇక ఈ సినిమాల్లో కనీసం రెండు హిట్టయినా నభా రేంజ్ మళ్ళీ టాప్ ప్లేస్‌కు వెళ్లడం ఖాయం. అటు గ్లామర్ పరంగా, ఇటు నటన పరంగా తనను తాను నిరూపించుకోవడానికి నభా గట్టిగానే ప్రయత్నిస్తోంది.

## ముగింపు: ఇస్మార్ట్ పిల్లా ఈజ్ బ్యాక్:



యాక్సిడెంట్ వంటి కష్టాలను దాటుకుని మళ్ళీ వెండితెరపై మెరవడానికి నభా చేస్తున్న కృషిని అభినందించాల్సిందే. తన గ్లామర్‌తో కుర్రాళ్ల మనసు గెలుచుకుంటూనే, మరోవైపు వైవిధ్యమైన పాత్రలతో మెప్పించడానికి సిద్ధమవుతోంది. మరి రాబోయే సినిమాలతో ఈ అందాల భామ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో వేచి చూడాలి. ఏది ఏమైనా, తన హాట్ ఫోటోలతో నభా మరోసారి సోషల్ మీడియా క్వీన్ అని నిరూపించుకుంది.

# రాయ్ లక్ష్మి బీచ్ గ్లామర్.. నెటిజన్లకు విజువల్ ట్రీట్!



సౌత్ ఇండియన్ సినిమా గ్లామర్ క్వీన్, 'రత్తాలు' ఫేమ్ రాయ్ లక్ష్మి మరోసారి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. తన హాట్ లుక్స్‌తో ఎప్పటికప్పుడు కుర్రకారు గుండెల్లో రైళ్లు పరిగెత్తించే ఈ భామ, తాజాగా స్విమ్మింగ్ పూల్‌లో చిల్ అవుతున్న ఫోటోలను షేర్ చేసింది. వెకేషన్ మూడ్‌లో ఉన్న లక్ష్మి, తన పర్‌ఫెక్ట్ ఫిగర్‌తో ఇంటర్నెట్‌ను హీటెక్కిస్తోంది. కేవలం గంటల్లోనే ఈ ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారి ఫ్యాన్స్‌ను కట్టిపడేస్తున్నాయి. ఆ విశేషాలు చూద్దాం..





## వెకేషన్ ఎంజాయ్ చేస్తూ.. ఓనింగ్ ది మోమెంట్:

రాయ్ లక్ష్మి ప్రస్తుతం తన బిజీ షెడ్యూల్ నుంచి చిన్న బ్రేక్ తీసుకుని వెకేషన్ ఎంజాయ్ చేస్తోంది. ఇందులో భాగంగా స్విమ్మింగ్ పూల్‌లో దిగిన కొన్ని స్టన్నింగ్ ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసింది. ఈ ఫోటోలకు, నేను మాత్రమే.. ఈ క్షణాన్ని ఆస్వాదిస్తూ అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌ను జోడించింది. ఆమె చూపులు, ఆ గ్లామర్ చూస్తుంటే కుర్రాళ్లకు నిద్రపట్టడం కష్టమే అనిపిస్తోంది. ఎప్పటిలాగే తన స్టైలిష్ లుక్స్‌తో తనేంటో మరోసారి నిరూపించుకుంది.



## రత్తాలు క్రేజ్.. ఐటెం సాంగ్స్ స్పెషలిస్ట్:

తెలుగు ప్రేక్షకులకు రాయ్ లక్ష్మి అనగానే ముందుగా గుర్తొచ్చేది 'ఖైదీ నెంబర్ 150'లోని 'రత్తాలు రత్తాలు' సాంగ్. మెగాస్టార్ చిరంజీవితో కలిసి ఆమె వేసిన స్టెప్పులు థియేటర్లను ఊపేశాయి. అలాగే పవన్ కళ్యాణ్ 'సర్దార్ గబ్బర్ సింగ్'లో కూడా స్పెషల్ సాంగ్‌తో అలరించింది. కేవలం ఐటెం సాంగ్స్ మాత్రమే కాకుండా, 'కాంచనమాల కేబుల్ టీవీ' వంటి సినిమాల్లో హీరోయిన్‌గా నటించి తన నటనతోనూ మెప్పించింది. సౌత్ ఇండస్ట్రీలో గ్లామర్ అండ్ డ్యాన్స్ అంటే రాయ్ లక్ష్మి పేరే వినిపిస్తుంది.



## ఫిట్‌నెస్ రహస్యం.. 30 ప్లస్‌లోనూ అదే అందం:

రాయ్ లక్ష్మికి ప్రస్తుతం 36 ఇయర్స్, కానీ ఆమెను చూస్తుంటే ఇరవై ఏళ్ల అమ్మాయిలాగే కనిపిస్తుంది. ఆమె ఫిట్‌నెస్ పట్ల తీసుకునే జాగ్రత్తలే అందుకు కారణం. నిత్యం యోగా, జిమ్ వర్కవుట్స్ చేస్తూ తన బాడీని చాలా పర్‌ఫెక్ట్‌గా మెయింటైన్ చేస్తోంది. అందుకే ఆమె ఏ డ్రెస్ వేసినా, ముఖ్యంగా బికినీ ఫోటో షూట్‌లు చేసినా అవి ఇన్‌స్టంట్‌గా వైరల్ అవుతుంటాయి. టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్ ఇలా అన్ని భాషల్లోనూ ఆమెకు భారీ ఫాలోయింగ్ ఉండటానికి ఇదే ప్రధాన కారణం.

## సోషల్ మీడియా క్వీన్:

మొత్తానికి రాయ్ లక్ష్మి తన లేటెస్ట్ ఫోటోలతో మరోసారి హాట్ టాపిక్ అయిపోయింది. సినిమా అవకాశాల సంగతి పక్కన పెడితే, సోషల్ మీడియాలో మాత్రం ఆమె రేంజ్ తగ్గడం లేదు. తన వెకేషన్ ఫోటోలను చూసి నెటిజన్లు రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. "నిజమైన బికినీ క్వీన్ అంటే నువ్వే" అంటూ అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. మరి ఈ రేంజ్ గ్లామర్ షో చేస్తున్న మన 'రత్తాలు'కు త్వరలోనే మరిన్ని క్రేజీ ఆఫర్లు రావాలని మనమూ కోరుకుందాం.

# దేశీ నైట్స్.. లుక్స్ తో చంపేస్తున్న బాలయ్య బ్యూటీ!



సమయం దొరికితే చాలు వెకేషన్స్ అంటూ ఎంజాయ్ చేస్తున్న హీరోయిన్స్ అటు డే టైం లోనే కాకుండా ఇటు నైట్ టైమ్స్ లో కూడా నగర అందాలను చూస్తూ.. ఆస్వాదిస్తూ గ్లామర్ తో అభిమానులను కూడా అలరిస్తున్నారు. ఈ క్రమంలోనే బాల్కనీలో పౌర్ణమి వెన్నెలలో చల్లని గాలులకు మరింత హీట్ పుట్టించేలా అందంగా ముస్తాబయి అందరి మనసులు దోచుకుంటోంది ప్రముఖ బ్యూటీ ప్రగ్యా జైస్వాల్. మెరూన్ రెడ్ కలర్ చీర కట్టి అందాలు ఆరబోస్తూ.. బాల్కనీలో నగర అందాలను ఆస్వాదిస్తూ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. పైగా ఈ ఫోటోలకు దేశీ లుక్స్ అంటూ జోడించిన క్యాప్షన్ విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇక ఈ మధ్యకాలంలో ఎక్కువగా గ్లామర్ వలకబోస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ప్రగ్యా జైస్వాల్ మరొకసారి మేడ మీద నుంచి అందాలు ఆరబోయడంతో అభిమానులు ఈమె అందానికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.. ప్రగ్యా జైస్వాల్ అందం చూసి అభిమానులు ఒక్కొక్కరు ఒక్కో విధంగా కామెంట్ చేస్తూ ఆమెపై తమ ప్రేమను పంచుకుంటున్నారు. మొత్తానికైతే ప్రగ్యా జైస్వాల్ షేర్ చేసిన ఈ ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ప్రగ్యా జైస్వాల్ మధ్యప్రదేశ్ లోని జబల్పూర్ లో జన్మించింది. పూణేలోని సింబయాసిస్ లా స్కూల్ లో చదివింది. అలాగే సింబయాసిస్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న రోజుల్లోనే వివిధ రకాల అందాల పోటీలలో పాల్గొని విజయవంతమైన మోడల్గా ఎదిగింది. కళా, సంస్కృతి రంగంలో ఈమె సాధించిన విజయానికి గానూ 2014 జనవరి 22న సింబయాసిస్ సాంస్కృతిక్ పురస్కారం కూడా లభించింది. 2008లో సెమినా మిస్ ఇండియా అందాల పోటీల్లో పాల్గొని మిస్ ఫ్రెష్ ఫేస్, మిస్ ఫ్రెండ్ ఆఫ్ ఎర్త్ టైటిల్స్ ను సొంతం చేసుకుంది . అంతేకాదు డాబర్ వాటిక , మిలీనియం హైపర్ మార్కెట్ ఫర్ దుబాయ్, రిలయన్స్ డిజిటల్ ఎక్స్బిబి వంటి ఎన్నో పాపులర్ బ్రాండ్స్ కి అంబాసిడర్ గా కూడా చేసింది. అలా పాపులారిటీ సొంతం చేసుకున్న ప్రగ్యా జైస్వాల్ తొలిసారి 2014లో తెలుగు, తమిళ్ ద్విభాష చిత్రమైన దేగాలో అవకాశం అందుకుంది. ఆ తర్వాత టిట్టు ఎంబీఏ అనే హిందీ సినిమాతో బాలీవుడ్లోకి అడుగుపెట్టిన ఈమె 2015లో తెలుగులో వచ్చిన మిర్చి లాంటి కుర్రాడు సినిమాతో తెలుగు సినీ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాతో ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోకపోయినా ఆ తర్వాత క్రిష్ దర్శకత్వంలో వచ్చిన కంచె సినిమాలో నటించింది. ఈ సినిమాతో మంచి పేరు కూడా సొంతం చేసుకుంది. నిజానికి క్రిష్ గతంలో తీసిన గబ్బర్ ఈజ్ బ్యాక్ అనే సినిమాలో పాత్ర కోసం ఆడిషన్ ఇచ్చింది. కానీ ఆ పాత్ర ఆమెకు లభించలేదు. అందుకే క్రిష్ తన తదుపరి చిత్రంలో ఈమెకు అవకాశం కల్పించారు. ఇక అఖండ, డాకు మహారాజ్ సినిమాలతో భారీ పాపులారిటీ అందుకున్న ఈమె.. ఇప్పుడు మళ్లీ స్టార్ హోదాను దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది.

## కేసీఆర్ మాదిరిగానే రేవంత్ నాటకాలు: కిషన్ రెడ్డి



ఢిల్లీ : సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారంటూ కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుళ్ల పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అందరూ చీదరించుకుంటున్నారని అ?న్నారు. '2023లో మీరు ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 సబ్ గ్యారెంటీలు అమలు చేయకుండా నాటకాలు ఆడుతున్నారు. దేవుళ్ళపై అవాకులుచెవాకులు మాట్లాడుతున్నారు' అని కిషన్ రెడ్డి అన్నారు. తన అవసరాల కోసం ఏ గడ్డి తినడానికి అయినా ఆయన వెనుకాడరని, గతంలో కెసిఆర్ ఆడిన నాటకాలే రేవంత్ ఆడుతున్నారన్నారు. తన వైఫల్యాలు కప్పి పుచ్చుకునేందుకు రేవంత్ రాజ్యాంగ సంస్థలపై దాడి చేస్తున్నారని, హిందువులంటే చులకనగా మాట్లాడుతున్నారని అన్నారు. ఇతర మతాలపై ఇలా మాట్లాడే దమ్ముందా? అని ప్రశ్నించారు. 50 శాతం పెంపు ఫార్ములాతో దక్షిణ రాష్ట్రాలకు నాయ్యం చేస్తామంటే ఎందుకు కాంగ్రెస్ ముందుకు రావడం లేదు. సోనియా కుటుంబానికి బానిస అని, ఆ కుటుంబం కోసం ప్రాణ త్యాగం చేస్తానని రేవంత్ అంటున్నారన్నారు. ?కాగా ఎల్లుండి అమిత్ షా హైదరాబాద్ వస్తున్నారని, నాలుగున తూప్రాన్ లో పాల ఉత్పత్తి సహకార సమాఖ్య భవన్ శంకుస్థాపన చేస్తారని కిషన్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 2 నుంచి స్వచ్ఛ భారత్ అభియాన్ చేపట్టనున్నామని, ఫైళ్ల క్లియరెన్స్ పై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని తెలిపారు.

## రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి వైఎస్సార్‌సీపీ లేఖ



తాడేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల అంశానికి సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి వైఎస్సార్‌సీపీ లేఖ రాసింది. స్థానిక ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులకు సర్టిఫికేట్ల జారీ ఆలస్యంపై ఫిర్యాదు చేస్తూ లేఖ రాసింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి.. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ రాశారు. కుల, కమ్యూనిటీ సర్టిఫికెట్లు, నో-డ్యూస్, ఎన్‌ఓసీ సర్టిఫికెట్ల జారీలో జాప్యంపై ఫిర్యాదు చేశారు. సర్టిఫికేట్లు అందకపోతే నామినేషన్ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సర్టిఫికేట్ల జారీని ఆలస్యం లేకుండా చూడాలని ఎస్‌ఈసీకి విన్నవించారు. ఈ మేరకు అధికారులకు తక్షణ ఆదేశాలు ఇవ్వాలని ఎస్‌ఈసీని కోరారు. ఇందులో ఎలాంటి వివక్షతకు తావులేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## కెప్టెన్ స్మిట్ మచ్చార్‌కు సెల్యూట్: వైఎస్ జగన్



తాడేపల్లి: ఫ్లైదుబాయ్ విమాన కెప్టెన్ స్మిట్ మచ్చార్‌పై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రశంసలు కురిపించారు. ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలను కాపాడేందుకు ఆయన అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారని కొనియాడారు. ఫ్లైదుబాయ్ విమాన ఘటన విషయమై వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా.. 'ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా కెప్టెన్ స్మిట్ మచ్చార్ ధైర్యంగా నిలిచారని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఆయన ధైర్యం, త్యాగం, నిస్వార్థ సేవ ప్రశంసనీయమని అన్నారు. ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలను కాపాడేందుకు ఆయన అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. స్మిట్ మచ్చార్ దేశం గర్వించదగ్గ నిజమైన హీరో అని కొనియాడారు. అలాగే, కెప్టెన్ స్మిట్ మచ్చార్ త్వరగా కోలుకోవాలని వైఎస్ జగన్ ఆకాంక్షించారు.ు

## హైదరాబాద్ షాపుల్లో 'మేడ్ ఇన్ పాకిస్థాన్'




హైదరాబాద్: పాకిస్థాన్ నుంచి అక్రమంగా దిగుమతి అయిన కాస్మెటిక్ ఉత్పత్తులను విక్రయిస్తున్న షాపులపై టాస్క్‌ఫోర్స్, సీడీఎస్‌సీఓ అధికారులు మెరుపు దాడులు చేశారు. నాంపల్లి, హబీబ్‌నగర్‌లోని పలు షాపులు, గోడౌన్‌లలో నిర్వహించిన తనిఖీల్లో రూ.7 లక్షల విలువైన అనధికారిక కాస్మెటిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు, రిజిస్ట్రేషన్ లేకుండా విక్రయిస్తున్న ఈ ఉత్పత్తుల్లో హానికరమైన భారలోహాలు ఉండే అవకాశం ఉందన్న హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ అక్రమ సరఫరా వెనుక ఉన్న ముంబై డీలర్ నుంచి హైదరాబాద్ వరకు సాగుతున్న నెట్‌వర్క్‌పై దర్యాప్తు చేపట్టారు. నాంపల్లి, హబీబ్ నగర్‌లోని బ్యూటీ లేడీస్ ఎంపోరియం, బ్యూటీ క్వీన్ షాప్, ఎస్.జె. మెడికల్ షాపుల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. నిషేధిత, అనధికారిక కాస్మెటిక్ ఉత్పత్తుల జాబితాలో ఇవి ఉన్నాయని.. భారత్‌లో దిగుమతి చేసుకోవడానికి సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి అవసరమైన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందలేదని అధికారులు స్పష్టం చేశారు. గుర్తించిన ఉత్పత్తులలో చర్మ కాంతి కోసం విక్రయిస్తున్న బ్యూటీ క్రీములు, సబ్బులు ఉన్నాయని.. ఇవి పాకిస్తాన్‌లో తయారయ్యాయని.. ఎలాంటి ముందస్తు అనుమతులు, రిజిస్ట్రేషన్ లేకుండా భారత్‌లోకి అక్రమంగా దిగుమతి చేసుకున్నట్లు తేలింది. ప్రాథమిక విచారణలో ఈ కాస్మెటిక్ ఉత్పత్తులను ముంబైకి చెందిన ఓ డీలర్ నుంచి కొనుగోలు చేసినట్లు తెలిసింది. అతను విదేశాల నుండి ఈ ఉత్పత్తులను తెప్పించి హైదరాబాద్‌లోని డీలర్లకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక విక్రేతలు ఈ పాకిస్తాన్ ఆధారిత ఉత్పత్తుల కొనుగోలుకు సంబంధించి ఎలాంటి సరైన బిల్లులు, ఇన్వాయిస్‌లు, రసీదులు నిర్వహించడం లేదని ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఇదే తరహాలో హైదరాబాద్, సంతోష్ నగర్‌లోని మదీనా కాస్మెటిక్ యజమాని సయ్యద్ ఇస్మాయిల్ కూడా తన షాపులో ఇటువంటి అనధికార కాస్మెటిక్ ఉత్పత్తులను విక్రయాలు జరుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సరుకు ఎక్కడి నుండి వస్తుందనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. షాపులలో లభించిన సరుకుతో పాటు, అదనపు స్టాక్‌ను ఒక గోడౌన్‌లో భద్రపరిచినట్లు అదికారులు గుర్తించారు. ఎస్.జె. మెడికల్ యజమాని, ఫార్మాసిస్ట్‌గా పనిచేస్తున్న సయ్యద్ ఆబిద్ అలీ కూడా ఈ కాస్మెటిక్ ఉత్పత్తుల విక్రయాలు జరుపుతున్నట్లు విచారణలో తేలింది. అదే ప్రాంతంలో వ్యాపారం చేస్తున్న రియాజుద్దీన్ అనే మరో వ్యక్తి కూడా ఈ విక్రయాల్లో భాగస్వామిగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

## ఆస్తులపై సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఆర్మూర్ నియోజకవర్గ నేతలతో కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబం, రేవంత్ రెడ్డి ఆస్తులపై సుప్రీంకోర్టు,హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించే దమ్ముందా అని ప్రశ్నించారు. నా ఆస్తులు, మీ ఆస్తులు పుట్టిన కాడి నుంచి తీద్దాం. కేసీఆర్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు, అలాగే మీరు (రేవంత్ రెడ్డి) పుట్టినప్పటి నుంచి నేటి వరకు కూడబెట్టిన ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు లేఖ రాయడానికి మీకు దమ్ముందా? అని నిలదీశారు. విచారణలో తమ తప్పుందని తేలితే జడ్జి ఏ శిక్ష వేసినా సిద్ధమని స్పష్టం చేశారు. కమల్ హాసన్,రజనీకాంత్ కంటే సీఎం రేవంత్ గొప్పగా నటిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే రేవంత్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను 2006లోనే హోటల్ వ్యాపారం ప్రారంభించానని, అది ఇప్పుడు మూడు హోటల్స్ అయ్యాయని, ఆ వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్లోనే స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు. వ్యాపారం చేయడం తప్పా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిరిసిల్లలో 33 మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకుని చనిపోయినా ప్రభుత్వానికి పట్టడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా పాలన అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు.

# జైశంకర్ నిర్మొహమాటం



సంక్షోభ కాలంలో తటస్థంగా ఉండటం, మర్యాదలు పాటిస్తూ మంచితనం ఒలకబోయటం కుదరదు. అది అవతలిపక్షానికే లబ్ధి చేకూరుస్తుంది. అమెరికా తీరుపై దౌత్య మార్గాల్లో మన దేశం లోగడ అసంతృప్తి తెలిపిందా అన్నది తెలియదుగానీ... తాజాగా విదేశాంగ మంత్రి జైశంకర్ నిర్మొహమాటంగా మాట్లాడారు. న్యూయార్క్‌లో సోమవారం జరిగిన ఆసియా సొసైటీ పాలసీ ఇనిస్టిట్యూట్(ఏఎస్‌పీఐ) సదస్సులో మన వైఖరేమిటో తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండోసారి ఏలుబడిలో కొచ్చాక మనతో తేడాగా ప్రవర్తిస్తున్నారు. భారత్‌వంటి అతి పెద్ద మార్కెట్ కావాలి. తన ఉత్పత్తులు నచ్చిన ధరకు విక్రయించుకోవాలి. లాభాలు గడించాలి. అదే సమయంలో పాకిస్తాన్‌తో అంటకాగుతూ, ఆకాశానికెత్తుతారు. దాన్ని బుజ్జగిస్తారు. రోగికి పత్యం రుచించనట్టు మనం చెప్పేది ఆయనకు నచ్చదు. నిజానికి ఇది ట్రంప్‌కు మాత్రమే పరిమితమైన వింత కాదు. ఆయన ముందున్న పాలకులు... వారే పార్టీ వారైనా ఇలాగే ప్రవర్తించారు. కాకపోతే దౌత్య మర్యాదలు పెద్దగా తెలియని, ఖాతరుచేయని మనిషి గనుక ట్రంప్ బాహాటంగా ప్రవర్తిస్తున్నారు. అందుకు కారణం లేకపోలేదు. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నాయకత్వంలోని భారత్... తనతో కాక నాటి సోవియెట్ యూనియన్‌తో సన్నిహితంగా మెలగటం అమెరికాకు కంటగింపైంది. అందుకు విరుగుడుగా పాకిస్తాన్‌ను చేరదీసింది. భారత్, పాక్‌మధ్య జరిగిన నాలుగు ప్రధాన యుద్ధాల్లోనూ, ఘర్షణల్లోనూ దాని పరోక్ష హస్తం ఉంది. నిజమైన మిత్రదేశంతో ఎలా మెలగాలో అమెరికాకు ఏనాడూ తెలియదు. ఉగ్రవాదంలో పాకిస్తాన్ పాత్రపై స్పష్టమైన సమాచారం ఉన్నా కంటితుడుపు చర్యగా దానికి విడుదల చేయాల్సిన నిధుల్ని ఆపినట్టు నటించటం, కొన్నాళ్లకే ఏదో ఒక సాకుతో విడుదల చేయటం దశాబ్దాలుగా రివాజైంది. ఆయుధ సామగ్రి విషయంలోనూ అంతే. ఉగ్రవాద చేష్టలతో ఆర్థికవ్యవస్థ సర్వనాశనమై దివాళా స్థితిలో పడిన పాకిస్తాన్‌ను ఆర్థికంగా ఆదుకోవాల్సిందే. కానీ అందుకు షరతులుండాలి. ఆ నిధుల్ని ఉగ్రవాదానికి ఊతమందించటానికి మళ్లించకూడదు. ఇందువల్ల మనకొస్తున్న ఇబ్బందులేమిటో అమెరికాకు పట్టదు. అలాగే వాణిజ్య ఒప్పందం పేరిట తాను విధించే షరతులు స్థానిక వ్యాపార, పారిశ్రామిక రంగాలకు చేకూర్చగల నష్టం దానికి లెక్కలేదు. ఈ విషయంలో భారత్ అభ్యంతరాలు ఆయన బేఖాతరు చేస్తారు. అంతా తన నిర్దేశానుసారం అమలు కావాల్సిందేనన్నది ట్రంప్ పట్టుదల. వాణిజ్య ఒప్పందం ఖరారైపోయిందంటూ పలుమార్లు ఆయన ఏకపక్షంగా ప్రకటించారు. మొన్న ఫిబ్రవరిలో సైతం ఇక సంతకాలే తరవాయి అన్నారు. కానీ భారత్‌నుంచి స్పందన లేకపోవటంతో అదనపు సుంకాలు విధించారు. ఈ బాపతు సుంకాలకు కోర్టులో చుక్కెదురైంది. కానీ అధిక సుంకాల పాటపాడుతూ బెదిరించడం మానుకోలేదు. మరోపక్క ఉగ్రవాదంవల్ల భారత్ నష్టపోతున్న వైనం తెలిసినా పాక్‌ను కట్టడి చేయరు. మనపట్ల సహానుభూతి చూపటం ధర్మమనుకోరు. భారత్--పాక్‌ల వైరం సంగతలా వుంచి ప్రపంచం ఇంతటి సంక్లిష్ట స్థితికి చేరుకోవటంలో అమెరికా పాత్ర ఎవరికీ తెలియంది కాదు. ఇరాన్‌పై అమెరికా దుందుడుకు చర్యలవల్ల హార్ముజ్ జలసంధిలో రవాణా నిలిచిపోయింది. ఉక్రెయిన్‌ను యూరప్ దేశాలద్వారా రెచ్చగొట్టి రష్యాను యుద్ధంలోకి నెట్టింది కూడా అమెరికాయే. ఈ రెండు పరిణామాల కారణంగా అంతర్జాతీయ వాణిజ్యం దెబ్బతింది. ముడి చమురు, ఎరువులు, ఆహార ధాన్యాల రవాణా నిలిచిపోయి ప్రపంచ దేశాలన్నీ సంక్షోభంలో పడ్డాయి. చాలా దేశాల ఆర్థికవ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనికి సూపర్ ఎల్‌నినో రూపంలో వచ్చిపడిన ప్రకృతి వైపరీత్యాలు తోడవుతున్నాయి. అందుకే రానున్న కాలంలో ప్రపంచ ప్రజలు కనీవినీ ఎరుగని పెను సంక్షోభం ఎదుర్కొనబోతున్నారని జైశంకర్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అమెరికాకు నేరుగా మన అసంతృప్తి తెలియజేయటం, చేస్తున్న తప్పుల్ని దిద్దుకోమని చెప్పటం... ప్రపంచం మునుపట్లా లేదని, ఏకచ్ఛత్రాధిపత్యం రోజులు అంతరించాయని చెప్పడం అత్యవసరం. దీన్ని సకాలంలో నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, తడబాటులేకుండా తెలిపినందుకు ఆయన్ను అభినందించాలి.

# ఓట్ల చోరీ సుడిగుండంలో ఈసీఐ!

ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ప్రజాస్వామ్యంగా వర్ధిల్లే భారతదేశంలో, ఎన్నికల విశ్వసనీయతే ఈ రోజు ప్రశ్నార్థకమై నిలిచింది. రాజ్యాంగ నిబంధనలకు తిలోదకాలు ఇస్తూ, ఒక వైపు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు, మరోవైపు మిగతా ఇద్దరు కమిషనర్లు వెలిబుచ్చిన తీవ్ర అభ్యంతరాలు బయటపడటంతో దేశం దిగ్భ్రాంతికి గురైంది. 'ఓట్ల చోరీ' ఆరోపణలు కేవలం ప్రతిపక్షాల రాజకీయ విమర్శలు కావని, స్వయంగా ఎన్నికల రాజ్యాంగ వ్యవస్థలోనే లోతైన సంక్షోభం నెలకొందని స్పష్టమవుతోంది. రాజ్యాంగ వ్యవస్థల ఉనికిని కాపాడుకోవడానికి, ప్రజల ఓటు హక్కు పరిరక్షణ కోసం హైదరాబాద్ నుంచి ఢిల్లీ, చెన్నై నుంచి లక్నో వరకు రోడ్లపైకి వచ్చిన ప్రజాగ్రహం ఇప్పుడు ఒకే గొంతుకతో ప్రశ్నిస్తోంది.

### కమిషన్ ఆమోదం లేకుండానే ఆదేశాల జారీ..

గత 10 నెలల కాలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఓటర్ల నమోదు ఫారం-6 మార్పులు, సాఫ్ట్‌వేర్ నియంత్రణ వంటి అత్యంత కీలక అంశాలపై తోటి ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీ కనీసం 14 సార్లు తమ తీవ్ర నిరసనను, అభ్యంతరాలను లిఖితపూర్వకంగా వ్యక్తం చేశారు. అమలులో ఉన్న నిబంధనలను ఉల్లంఘిస్తూ ఫారం-6లో 'గత ఎస్ఐఆర్ జాబితాలో మీ తాతలు, తండ్రుల పేర్లు ఉన్నాయా?" అనే కాలమ్‌ను కొత్తగా చేర్చడాన్ని 'చట్టవిరుద్ధం, అధికార దుర్వినియోగం' అని సంధు ఆక్షేపించినా సీఈసీ దాన్ని బేఖాతరు చేశారు.. కమిషన్ ఆమోదం లేకుండానే ఈసీఐ పేరుతో ఆదేశాలు జారీ అవుతున్నాయని, రాష్ట్ర కమిషన్ల స్వేచ్ఛను హరిస్తున్నారని ఇద్దరు కమిషనర్లు ఏకంగా కేబినెట్ కార్యదర్శికి ఫిర్యాదు చేయడం భారత ఎన్నికల చరిత్రలోనే మునుపెన్నడూ లేని తీవ్ర సంక్షోభాన్ని కళ్లకు కడుతోంది.

### రాజ్యాంగ వ్యవస్థలో చెలరేగిన అగ్నిపర్వతం..

ఎన్నికల సంఘం అంటే కేవలం ఒక్క వ్యక్తి నిర్ణయం కాదు. అది ప్రజాస్వామ్యానికి రక్షణగా నిలిచే ముగ్గురు సభ్యుల రాజ్యాంగ పీఠం. కానీ, గత పది నెలలుగా ఆ పీఠంపై తీవ్రమైన అసమ్మతి జ్వాలలు రగులుతున్నాయి. కమిషనర్లు పలు మార్లు వ్యక్తపరిచిన అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలు సంస్థాగత పారదర్శకతను పాతిపెట్టాయి. చట్టబద్ధమైన సవరణలు లేకుండా ఫారం-6లో ఇష్టారీతిన తెచ్చిన మార్పులు అక్రమమని తేల్చడమే కాక, 'కమిషన్ అనుమతి లేకుండా అసలు ఈ ఉత్తర్వులు ఎవరు ఇస్తున్నారు' అని కమిషనర్లే ప్రశ్నించే పరిస్థితి రావడం అగా ధాన్ని సూచిస్తోంది. బెంగాల్‌లో దాఖలైన 16 లక్షల




అప్పీళ్ల వెనుక ఏ అధికారిక అనుమతి ఉందో చెప్పాలని అధికారులు నిలదీయడం, కేంద్రీకృత సాఫ్ట్‌వేర్ పేరిట రాష్ట్ర అధికారుల అధికారాలను లాక్కోవడంపై కేబినెట్ సెక్రటరీకి లేఖ రాయడం చూస్తుంటే ఇది కేవలం పరిపాలనాపరమైన లోపం కాదు, భారత రాజ్యాంగ గుండెకాయపై పడిన కోలుకోలేని దెబ్బ అని స్పష్టమవుతోంది.

### సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు..

మరోవైపు, సీఈసీ, ఈసీల నియామక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)ని మినహాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా స్పందిస్తూ.. 'భారత ప్రజల దురదృష్టం ఏమిటంటే, రాజ్యాంగం నిర్దేశించిన ఉన్నతమైన ఆదర్శాలు నీరుగారిపోయాయి. అధికారంలో ఉన్నవారు స్వతంత్ర ఎన్నికల సంఘాన్ని కోరు కోవడం లేదు. ప్రధానమంత్రి స్వయంగా నియమించిన కేంద్ర మంత్రి, ఆ ప్రధానికి వ్యతిరేకంగా నిలబడతారని ఎలా ఆశించగలం?"'అని స్పష్టం చేశారు.

### వీధుల్లో వెల్లువెత్తిన ప్రజాగ్రహం..

ఇది కేవలం ఢిల్లీలోని వీధుల్లోనో, పార్లమెంట్ ప్రాంగణంలోనో ఆగిపోయిన నిరసన కాదు.. ఇది సామాన్య పౌరుడి అంతరాత్మ నుంచి రగిలిన అగ్నిజ్వాల. హైదరాబాద్ కాపౌండ్స్ నుంచి ఢిల్లీ వీధుల వరకు, చెన్నై తీరం నుంచి లక్నో వీధుల వరకు ప్రతిపక్షాలు, విద్యార్థి సమూహాలు, పౌర హక్కుల పోరాట యోధులు ఏకమై 'మా ఓటు- మా భవిష్యత్తు' నినాదంతో వీధుల్లోకి వచ్చారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో 'స్టాప్ ఓట్ చోరీ' హాష్‌ట్యాగ్ మారుమోగుతూ, ప్రొఫైల్ పిక్చర్లు నల్లటి విప్లవ వర్ణంగా మారుతుండటం దేశవ్యాప్తంగా కమ్ముకున్న ప్రజాచైతన్యానికి నిదర్శనం. జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసించేందుకు 'ఇండియా' కూటమి సిద్ధమవుతుండగా, సీజేపీ ప్రతినిధులు 48 గంటల అల్టిమేటమ్ జారీ చేస్తూ "జంతర్ మంతర్ 2.0" దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చారు.

### దశాబ్దాల ఓటర్లపై 'సాఫ్ట్‌వేర్' పోటు..

ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ సాంకేతికత నెపంతో సామాన్యుల పాలిట ఉరితాడై బిగుసుకుంటోంది. పేరులో పొరపాట్లు, ఇంటిపేరు వ్యత్యాసాలు, వయస్సు సరిపోలలేదనే కారణాలతో బీహార్, బెంగా ల్‌లలో కోట్ల మంది పేర్లను సాఫ్ట్‌వేర్ రాత్రికి రాత్రే తొలగించింది. బెంగాల్‌లోనే ఏకంగా 22 లక్షల మంది ఓట్లను తొలగించగా, వారిలో 16.10 లక్షల మంది తమ ఓటు హక్కును పునరుద్ధరించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఒకే ఇంటి చిరునామాతో 80 మందిని నమోదు చేయడం, బెంగళూరు మహదేవపుర నియోజకవర్గంలోనే లక్షకు పైగా నకిలీ ఓటర్లు వెలుగుచూడటం,ఒక మనిషి - ఒక ఓటు' సూత్రానికి సజీవ ఖననం!

### రాజ్యాంగ ఆత్మను కాపాడుకుందాం!

ఓటు అనేది కేవలం కాగితంపై వేసే ముద్రో, ఈవీఎంలో నొక్కే బటానో కాదు. అది ఈ దేశ పౌరుడి స్వేచ్ఛకు, ఆత్మగౌరవానికి సంకేతం. ఎన్నికల సంఘం తటస్థతను నిరూపించుకోలేకపోతే, నిష్పాక్షికతను కోల్పో తే, అది కేవలం ఓటర్ల జాబితా సమస్యగా మిగలదు ఈ దేశ రాజ్యాంగ ఉనికికే ముప్పుగా పరిణమిస్తుంది. తప్పు దోవ పట్టించే రాజకీయ శక్తులకు, ఏకపక్షంగా వ్యవహరించే అధికారులకు తలవంచకుండా స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల వ్యవస్థను పునరుద్ధరించుకోవాల్సిన సమయం ఇది. నేడు మనం నిశ్శబ్దంగా ఉంటే, రేపు మన పిల్లలకు ప్రశ్నించే హక్కు కూడా ఉండదు. ఓటు హక్కును కాపాడుకోవడం అంటే భారతావని రాజ్యాంగ ఆత్మను కాపాడుకోవడమే.

# తెలంగాణ వారసత్వ సంపదకు గుర్తింపు ఏదీ?

దేశాల సంపదలో పర్యాటక ఆదాయం క్రమక్రమంగా పెరుగుతూ వస్తోంది. పర్యాటకాలు పలు రకాలు. చారిత్రక, సాంస్కృతిక వారసత్వ పర్యాటకం, ఆధ్యాత్మిక పర్యాటకం, పర్యావరణ, సాహస యాత్ర పర్యాటకం వంటివి టూరిస్టులను ఆకర్షిస్తున్నాయి.

### టాప్‌లో తాజ్‌మహల్..

దేశంలో పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చి, స్వదేశీ టూరిస్టులను ఎక్కువగా ఆకర్షిస్తున్న రాష్ట్రాలలో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. తరువాత వరుసగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ లు ఉన్నాయి. అలాగే మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలలోని పర్యాటక కేంద్రాలను విదేశీ యాత్రికులు ఎక్కువ సంఖ్యలో సందర్శించడం జరుగుతుంది. మన దేశంలో విదేశీ టూరిస్టులలో అత్యధికంగా సందర్శించే పర్యాటక స్థలాలలో మొదటి స్థానం తాజ్ మహల్‌కు దక్కుతుంది. రెండో స్థానంలో ఆగ్రా ఫోర్ట్, కుతుబ్ మినార్, ఎర్రకోటలు వరుసగా ఉండటాన్ని గమనించవచ్చు.

### వాటిమీదే పర్యాటకుల దృష్టి!

ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగానైనా సాంస్కృతిక వారసత్వ కట్టడాలే సందర్శకులను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయనేది వాస్తవం. కాబట్టి దేశంలో, రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలంటే ముందుగా ఆయా ప్రాంతాలలో ఉన్న చారిత్రక సాంస్కృతిక వారసత్వ కట్టడాలను గుర్తించి, విస్తృత ప్రచారంలోకి తేవాలి. అక్కడ మౌలిక వసతులను ఏర్పాటు చేయాలి. దేశంలో పురాతన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన అవశేషాల గుర్తింపు, పరిరక్షణ వంటి నిర్వహణలను ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఎ.ఎస్.ఐ) చూసుకుంటుంది. ఈ కేంద్ర సంస్థ గుర్తింపుతోనే ఆయా వారసత్వ ప్రదేశాలకు దేశవ్యాప్త ప్రచారం, ప్రాధాన్యత లభి స్తుంది. దీనితో దేశీయ, విదేశీయ టూరిస్టులు ఆకర్షించబడుతారు.

### వారసత్వ కట్టడాలలో తెలంగాణ లీస్ట్..!

దేశం మొత్తం కేంద్ర పురావస్తు శాఖ వారసత్వ పరిరక్షణ కట్టడాలు 3,698 ఉంటే, అందులో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 743 ఉన్నాయి. మన పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్‌లో 135,




కర్ణాటకలో 506, తమిళనాడులో 412, మహారాష్ట్రలో 286, చత్తీస్‌ఘడ్‌లో 46ను ఎ.ఎస్.ఐ గుర్తించింది. అయితే తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర పురావస్తు శాఖ పరిధిలోని గుర్తింపు కట్టడాలు మూడు నెలల క్రితం వరకు ఎనిమిది. ప్రస్తుతం ఆ సంఖ్య కేవలం పదికి చేరింది. మొత్తం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కలిపి చూస్తే అతి తక్కువ వారసత్వ పరిరక్షణ కట్టడాల గుర్తింపు కలిగిన రాష్ట్రం తెలంగాణే. దేశంలో పురావస్తు వారసత్వ కట్టడాల పరిరక్షణ జోన్లు 38. వాటిల్లో అతి తక్కువ సంఖ్యలో పరిరక్షణ ప్రాంతాలు కలిగిన జోన్ హైదరాబాద్‌నే.

### వారసత్వ కట్టడాల అభివృద్ధి..

పర్యాటక రంగ అభివృద్ధికి అవకాశం ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ ఒకటి. దీనికి ప్రధాన కారణం అంతర్జాతీయ నగరమైన హైదరాబాద్ ఉండటం. నగరం చుట్టు అనేక సాంస్కృతిక వారసత్వ ప్రాంతాలు, సరదాగా గడిపేందుకు స్థలాలు, మనసుకు ఉల్లాసం కలిగించే వివిధ ప్రదేశాలు కలవు. అందుచేత దేశవిదేశాల నుంచి పర్యాటకులు హైదరాబాద్ సందర్శనకు ఆసక్తి చూపుతున్నారు. ఇవే కాకుండా రాష్ట్రం నలుమూలల అనేక పర్యాటక స్థలాలు కలవు.. తెలంగాణ వారసత్వ సంపదకు పెట్టింది పేరు. కావున రాష్ట్ర ప్రభుత్వం మరింతగా వారసత్వ కట్టడాల అభివృద్ధిపై దృష్టి సారించాలి.

### ఎ.ఎస్.ఐ గుర్తింపుకై ప్రయత్నించాలి!

దేశంలో ఎ.ఎస్.ఐ గుర్తించి, పరిరక్షిస్తున్న ప్రదేశాలనే పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో సందర్శిస్తున్నారు.. కాబట్టి తెలంగాణ చారిత్రక సాంస్కృతిక వారసత్వ కట్టడాలకు ఎ.ఎస్.ఐ గుర్తింపు కోసం ప్రయత్నించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భేషజాలకు పోకుండా తెలంగాణ అస్థిత్వం, వారసత్వాన్ని ప్రపంచానికి చాటింపు జరిగేలా ఈ విషయంలో కలిసికట్టుగా చొరవ చూపాలి. తద్వారా సాంస్కృతిక వారసత్వ ప్రాంతాల సంఖ్య పెరిగి, అభివృద్ధి చెంది వాటిని సందర్శించే పర్యాటకుల సంఖ్య రెట్టింపు అవుతుంది. దీనితో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, సుస్థిర జీవనోపాధి లభిస్తుంది. చిన్న చిన్న వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. మొత్తంగా పర్యాటక రంగం అభివృద్ధి సాధిస్తుంది.

# రాగులతో లడ్డూలను ఇలా తయారు చేసి తినండి.. రోజూ ఒకటి తింటే ఎన్నో లాభాలు..!



ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరగడంతో ఇప్పుడు చాలా మంది చిరు ధాన్యాలను తినడం ప్రారంభించారు. కానీ ఒకప్పుడు మన పూర్వీకులు వీటినే ప్రధాన ఆహారంగా తినేవారు. అందుకనే వారు అన్ని ఏళ్ల పాటు ఆరోగ్యంగా బతికేవారు. వృద్ధాప్యంలోనూ ఎలాంటి వ్యాధులు వచ్చేవి కావు. శారీరకంగా చాలా దృఢంగా, యాక్టివ్‌గా ఉండేవారు. అయితే చిరు ధాన్యాల్లో రాగులు ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఇవి అందరికీ అందుబాటులో ఉంటాయి. రాగులతో అనేక రకాల వంటకాలను తయారు చేయవచ్చు. మన దేశంలో ఎంతో పూర్వ కాలం నుంచే రాగులను తింటున్నారు. రాగులతో పిండి తయారు చేసి దాంతో పలు వంటకాలను వండుతుంటారు. ఈ క్రమంలోనే రాగులకు చెందిన వంటకాల్లో రాగి లడ్డూలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. వీటిని రోజుకు ఒకటి తింటే చాలు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## ఎముకల దృఢత్వానికి..

రాగుల్లో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. వయస్సు మీద పడిన తరువాత ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా చూస్తుంది. ముఖ్యంగా చిన్నారులకు రాగులు ఎంతో మేలు చేస్తాయి. వారిలో ఎదుగుదల సరిగ్గా ఉంటుంది. పోషకాహార లోపాన్ని తగ్గించవచ్చు. రాగుల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తుంది. దీని వల్ల మలబద్ధకం సైతం తగ్గుతుంది. కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అధిక బరువు తగ్గాలనుకుంటున్న వారు రాగులను రోజూ ఏదో ఒక రూపంలో తింటే మేలు జరుగుతుంది. రాగులను లడ్డూల రూపంలో రోజూ తినడం చాలా సులభమైన పద్ధతిగా చెప్పవచ్చు.

## రక్తహీనతకు..

రాగులు డయాబెటిస్ ఉన్నవారికి కూడా ఎంతో మేలు చేస్తాయి. వీటి గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే రక్తంలో షుగర్ లెవల్స్ వెంటనే పెరగవు. పైగా వీటిల్లో ఉండే ఫైబర్ వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. అందువల్ల డయాబెటిస్ ఉన్నవారు సైతం రాగులను తినవచ్చు. అయితే డయాబెటిస్ ఉన్నవారు రాగి లడ్డూలను తినాలనుకుంటే వాటిని బెల్లంతో తయారు చేసి తింటే మంచిది. లేదంటే ప్రయోజనాలు లభించవు. ఇక రాగుల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి సహాయం చేస్తుంది. అందువల్ల రాగి లడ్డూలను తింటుంటే రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. రాగులను ఆహారంలో భాగం చేసుకుంటే కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

## ఇలా తయారు చేయండి..

రాగి పిండితో ఇతర వంటకాలను చేయడం రోజూ కష్టంతో కూడుకున్న పని. కానీ లడ్డూలను ఒకసారి చేసి పెట్టుకుంటే రోజూ ఒకటి చొప్పున తినవచ్చు. దీంతో రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం పొందవచ్చు. రాగి లడ్డూలను తయారు చేసేందుకు గాను రాగి పిండిని తీసుకుని ముందుగా దాన్ని పెనంపై వేయించాలి. తరువాత అందులో యాలకుల పొడి కలిపి పెట్టుకోవాలి. అనంతరం బెల్లం పాకం పట్టి ముందు సిద్ధం చేసుకున్న రాగి పిండిలో వేసి కలపాలి. అందులోనే కాస్త నెయ్యిని మరిగించి కలపాలి. ఈ పిండిని లడ్డూల్లా తయారు చేసి నిల్వ చేయాలి. ఈ లడ్డూలను రోజుకు ఒకటి చొప్పున తినవచ్చు. అయితే బాదంపప్పు, ఖర్జూరాలు, గుమ్మడికాయ విత్తనాలు వంటి డ్రై ఫ్రూట్స్‌ను కూడా ఈ లడ్డూల్లో కలపవచ్చు. దీంతో మరిన్ని పోషకాలు లభిస్తాయి. ఇంకా ఎక్కువ లాభాలు కలుగుతాయి. ఇలా రాగి లడ్డూలను తయారు చేసి తింటే ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు.

# బీర సాగు..ఆదాయం బాగు.. ఖర్చు రూ.లక్షన్నర.. రాబడి రూ.4 లక్షలు



గుమ్మడిదల, డిసెంబర్22: కౌలు రైతుగా పంటలను సాగు చేసుకున్న రైతు ఇప్పుడు భూస్వామి అయ్యాడు. కూరగాయ పంటలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని మంభాపూర్ శివారులోని గ్రీన్ ఎకర్‌లో రైతుహనీఫ్ కూరగాయలను పండిస్తున్నాడు. ఆధునిక పద్ధతుల్లో కూరగాయలు సాగు చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. డిమాండ్ తగ్గట్టు కూరగాయల పంటలను సాగు చేస్తూ కాసుల వర్షం కురిపిస్తున్నారు. రైతు హనీఫ్ సాగు చేస్తున్న పంటలను రాష్ట్ర, జిల్లా ఉద్యానవనశాఖ అధికారులు, వివిధ రాష్ట్రాల రైతులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అభినందిస్తున్నారు.

## ఖర్చు రూ.లక్షన్నర.. ఆదాయం రూ.4 లక్షలు

మల్చింగ్, పందిరి, డ్రిప్ పద్ధతిలో బీరకాయ పంట సాగు చేస్తున్నాడు. ఎకరా బీర సాగుకు దాదాపు రూ.లక్షన్నర ఖర్చు అవుతాయని, ఇందులో 25 టన్నులు బీర పంట దిడుబడి వస్తుందని రైతు తెలిపాడు. పెట్టుబడి, కూలీల ఖర్చు పోను ఎకరాకు సుమారుగా రూ.4 లక్షలు దిగుబడి సాధిస్తుందని, 12 ఎకరాల్లో రూ.50 లక్షల ఆదాయం సంపాదించవచ్చని వివరించాడు. వరి సాగుకన్నా కూరగాయల సాగుతోనే ఆదాయం ఎక్కువగా వస్తుందని చెబుతున్నాడు. రైతులకు కూరగాయల సాగుతో మంచి లాభాలు వస్తాయని వ్యవసాయాధికారులు, ఉద్యానవశాఖ అధికారులు సూచిస్తున్నారు.

బీర సాగులో లాభాలు..

గ్రీన్ ఎకర్‌లో వరి పంట సాగుకు ప్రతికూల పరిస్థితుల్లో కూరగాయల పంటలపై రైతు హనీఫ్ దృష్టి సారించారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సబ్సిడీలను వినియోగించుకుని కూరగాయలను సాగు చేశాడు. ఆధునిక పద్ధతులను పాటించారు. తనకున్న 20 ఎకరాలలో 8 ఎకరాల్లో మామిడితోట, 12 ఎకరాలు బీర పంటను మల్చింగ్, డ్రిప్, పందిరి సాగు ద్వారా పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పుడు ఈబీరపంట కోతకు వచ్చింది. రెండు, మూడు రోజులకోసారి బీరకాయలను మార్కెట్‌కు తరలిస్తున్నారు.

కూరగాయల పంటలనే నమ్ముకున్న

కూరగాయలను మల్చింగ్, డ్రిప్, పద్ధతిలో సాగు చేస్తున్న. ప్రస్తుతం బీర పంట సాగు చేస్తున్న. మల్చింగ్ ద్వారా కలుపు ఉండదు. డ్రిప్ ద్వారా ప్రతి మొక్కకూ ఎరువు అందిస్తా. చీడ పురుగులకు రసాయన ఎరువులు తక్కువ మొత్తంలో వాడుతాను. అధికంగా సేంద్రియ ఎరువుల వైపే మొగ్గు చూపిస్తా. సీజన్‌ను బట్టి పంట మార్పిడి చేస్తున్న. ఒకసారి టమాట, మరోసారి కాకర, బెండ వంటి కూరగాయల పంటలను సాగు చేస్తాను. డిమాండ్‌ను బట్టి కూరగాయలను సాగు చేస్తూ మంచి లాభాలు సాధించవచ్చు. కూరగాయ పంటలకు కనీస మద్దతు ధర ప్రకటిస్తే రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి పెడుతారు.

# దేశంలో పెరుగుతున్న అల్జీమర్స్ వ్యాధి కేసులు.. లక్షణాలను ముందే గుర్తించాలంటున్న నిపుణులు..



వయసు పెరుగుతున్న కొద్దీ జ్ఞాపకశక్తి తగ్గడం, విషయాలను గుర్తుంచుకోవడంలో ఇబ్బంది పడడం సహజమేనని భావిస్తూ ఉంటారు. అయితే జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం, రోజువారీ పనులను నిర్వహించే విధానంలో స్పష్టమైన మార్పులు కనిపిస్తే వాటిని వృద్ధాప్యంలో సహజంగా వచ్చే మార్పులుగా నిర్లక్ష్యం చేయకూడదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దేశంలో వృద్ధుల్లో చిత్తవైకల్యం కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ మార్పులను తొలిదశలోనే గుర్తించి వైద్యుల సలహా తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు. ప్రస్తుతం భారత్‌లో 60 ఏళ్లు పైబడిన వారిలో సుమారు 88 లక్షల మంది చిత్తవైకల్యంతో జీవిస్తున్నట్లు అంచనా. ఈ సంఖ్య 2036 నాటికి దాదాపు 1.69 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని నిపుణులు పేర్కొన్నారు.

అల్జీమర్స్ కేసులే అధికం..

చిత్తవైకల్యం కేసుల్లో ఎక్కువ భాగం అల్జీమర్స్ వ్యాధికి సంబంధించినవే. ఇది మెదడులోని నాడీకణాలను క్రమంగా దెబ్బతీసే ప్రగతిశీల నాడీ సంబంధిత వ్యాధి. జ్ఞాపకశక్తి తగ్గడం మాత్రమే కాకుండా ఆలోచించడం, మాట్లాడడం, నిర్ణయాలు తీసుకోవడం, స్వతంత్రంగా రోజువారీ పనులు చేసుకోవడం వంటి సామర్థ్యాలపై కూడా దీని ప్రభావం పడుతుంది. అల్జీమర్స్ లక్షణాలు బయటకు కనిపించడానికి చాలా సంవత్సరాల ముందే మెదడులో మార్పులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మెదడులో అమైలాయిడ్ అనే ప్రొటీన్ అసాధారణంగా పేరుకుపోవడం వంటి మార్పులు సాధారణ లక్షణాలు కనిపించడానికి సుమారు 20 ఏళ్ల ముందే ప్రారంభమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ముందే గుర్తించాలి..

ప్రారంభ దశలోనే వ్యాధి లక్షణాలను గుర్తించడం ద్వారా బాధితులు, వారి కుటుంబ సభ్యులు పరిస్థితిని మెరుగ్గా అర్థం చేసుకోవడంతోపాటు భవిష్యత్తు సంరక్షణకు అవసరమైన ప్రణాళికలను రూపొందించుకోవచ్చు. చికిత్స, సంరక్షణ, అందుబాటులో ఉన్న సహాయక సేవల గురించి ముందుగానే తెలుసుకోవడం కూడా సాధ్యమవుతుంది. జ్ఞాపకశక్తిలో పదేపదే మార్పులు కనిపించడం, విషయాలను అర్థం చేసుకోవడంలో ఇబ్బంది, నిర్ణయాలు తీసుకోవడంలో సమస్యలు, సంభాషణలో మార్పులు లేదా రోజువారీ పనులను స్వతంత్రంగా చేసుకోవడంలో ఇబ్బంది వంటి మార్పులను గమనిస్తే వైద్యులను సంప్రదించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఇటువంటి లక్షణాలకు అనేక కారణాలు ఉండే అవకాశం ఉన్నందున వైద్యపరీక్షల ద్వారా అసలు కారణాన్ని గుర్తించడం ముఖ్యమని చెబుతున్నారు.

కుటుంబం అప్రమత్తత అవసరం..

అల్జీమర్స్ వ్యాధి ఒక్క బాధితుడి జీవితాన్నే కాకుండా మొత్తం కుటుంబంపై ప్రభావం చూపే పరిస్థితి. అందువల్ల జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం, రోజువారీ పనితీరులో వస్తున్న మార్పులపై కుటుంబ సభ్యులు కూడా శ్రద్ధ వహించాలి. వ్యాధి పెరుగుతున్న భారాన్ని ఎదుర్కోవాలంటే ప్రజల్లో అవగాహన పెంచడం, లక్షణాలను తొలిదశలోనే గుర్తించడం, సకాలంలో వైద్య నిపుణులను సంప్రదించడం అవసరమని నిపుణులు చెబుతున్నారు. కుటుంబ సభ్యుల అవసరాలు, అభిప్రాయాలు, భవిష్యత్తు సంరక్షణకు సంబంధించిన అంశాలపై ముందుగానే చర్చించుకోవడం ద్వారా పరిస్థితిని ఎదుర్కోవడానికి మెరుగైన ప్రణాళిక రూపొందించుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

# పసుపు పంటలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

కుభీర్ : ఇటీవల కురిసిన వర్షాలకు పసుపు పంటలో పసుపు పంటకు దుంప కుళ్లు, తాటాకు మచ్చ తెగులు ఆశిస్తోందని వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఎం. నారాయణ పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని జంగం పార్డి (కే) తదితర గ్రామాల్లో పంటలు సాగు చేసిన వ్యవసాయ క్షేత్రాలను స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. పసుపు పంట ఆకులపై అక్కడక్కడా పెద్ద మచ్చలు ఏర్పడడంతో పాటు ముదురు గోధుమ రంగులోని మచ్చల చుట్టూ పసుపు రంగు వలయం ఏర్పడుతుందన్నారు. రైతులు పసుపు పంటలు సస్యరక్షణ చర్యలను చేపట్టడంతో పాటు ఇటీవల కురిసిన వర్షాల వల్ల పసుపు పంటలో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలని సూచించారు. ఈ తెగుళ్ల నివారణకు మచ్చలు ఉన్న, ఎండిన ఆకులను తొలగించి కాల్చివేయాలని పేర్కొన్నారు. లీటరు నీటిలో ఒక గ్రాము కార్బెండజిం లేదా 2.5 గ్రాముల మాంకోజెట్, 0.5 మి.లీ. సబ్బు నీరు లేదా ఒక గ్రామ్ థయోఫానేట్ మిథైల్ కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలన్నారు. ఇనుప ధాతు లోపం భూమిలో చౌడు, సున్నం, భాస్వరం ఎక్కువగా, సేంద్రియ పదార్థం తక్కువగా ఉన్న భూముల్లో ఇనుప ధాతులోపం కనిపిస్తుందన్నారు. దీనివల్ల ఆకులు తెల్లగా మారుతాయి. ఆకు పరిమాణం తగ్గి అంచుల కణజాలం దెబ్బతింటుంది. పంట చేతికొచ్చే సమయంలో దుంపలు, కొమ్ములు చిన్నవిగా తయారై నాణ్యత లోపిస్తుందని తెలిపారు. దీని నివారణకు మడిలో మురుగునీరు పోయే సౌకర్యం కల్పించడంతో పాటు లీటరు నీటిలో 5 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ లేదా 10 గ్రాముల అన్నభేది, ఒక గ్రాము నిమ్మ ఉప్పు కలిపి పైరుపై 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం పలు రైతుల సోయా, పత్తి క్షేత్రాలను పరిశీలించి తగు సూచనలు సలహాలను అందజేశారు. ఆయా గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఎన్‌రోల్‌మెంట్‌ను ఆన్‌లైన్లో నమోదు చేశారు.



# లవంగాలను పాలలో వేసి బాగా మరిగించి రోజూ రాత్రి పూట తాగండి.. ఎన్నో లాభాలు కలుగుతాయి..!



లవంగాలను మనం తరచూ వంటల్లో వేస్తుంటాం. వీటిని ఎక్కువగా మసాలా వంటల్లో వేస్తుంటారు. నాన్ వెజ్ వంటకాల్లో వీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. లవంగాలు ఘాటుగా ఉంటాయి కనుక కూరలు కారంగా ఉండాలని కోరుకునే వారు లవంగాలను ఎక్కువగా వాడుతుంటారు. అయితే లవంగాలను నేరుగా కూడా తింటుంటారు. లవంగాలను నోట్లో వేసుకుని నమిలితే అనేక లాభాలు కలుగుతాయి. కానీ ఘాటుగా ఉంటాయి కనుక కొందరు నేరుగా తినలేకపోతుంటారు. అలాంటి వారు లవంగాలను పాలలో వేసి మరిగించి తాగవచ్చు. ఈ మిశ్రమం అద్భుతమైన ఔషధంగా కూడా పనిచేస్తుంది. ఆయుర్వేదంలో ఎంతోకాలంగా ఈ మిశ్రమాన్ని ఔషధంగా ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలోనే పాలలో లవంగాలను వేసి మరిగించి తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. పలు వ్యాధులను సైతం నయం చేసుకోవచ్చు.

## సీజనల్ వ్యాధులకు చెక్..

పాలలో లవంగాలను వేసి మరిగించి తాగితే యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ముఖ్యంగా లవంగాల్లో ఉండే యూజినాల్ అనే సమ్మేళనం మన శరీరానికి అందుతుంది. ఇది యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్, యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల లవంగాలు, పాల మిశ్రమం రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. దీని వల్ల సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు. ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. లవంగాలు మన శరీరానికి వెచ్చదనాన్ని అందిస్తాయి. అందువల్ల ఈ పాలను తాగితే రాత్రిపూట శరీరం వెచ్చగా ఉంటుంది. చల్లని వాతావరణంలో మేలు జరుగుతుంది. అలాగే గొంతు సమస్యల నుంచి బయట పడవచ్చు. ముఖ్యంగా దగ్గు, గొంతు నొప్పి, గొంతులో గరగర, మంట వంటి సమస్యలు తగ్గుతాయి. బ్రాంకైటిస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. ఊపిరితిత్తుల వాపులు తగ్గి ఆరోగ్యంగా ఉంటాయి.

## జీర్ణ వ్యవస్థకు..

లవంగాలు, పాల మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్తి వంటి జీర్ణ సమస్యలు తగ్గుతాయి. జీర్ణాశయంలో పలు ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. ఇవి జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి. ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. లవంగాల్లో ఉండే యూజినాల్ అనే సమ్మేళనం యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలోని వాపులను తగ్గిస్తుంది. దీని వల్ల ఒళ్లు నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా కీళ్ల నొప్పులు ఉన్నవారికి మేలు జరుగుతుంది. లవంగాల పాలను తాగడం వల్ల నిద్రలేమి తగ్గుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. ఒత్తిడి, ఆందోళన తగ్గి మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు.

## లివర్ ఆరోగ్యానికి..

లవంగాల్లో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇవి అనేక అనారోగ్య సమస్యలను తగ్గిస్తాయి. లవంగాల పాలను తాగడం వల్ల నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్ల ఇన్‌ఫెక్షన్ల నుంచి ఉపశమనం లభిస్తుంది. లవంగాల్లో ఉండే యూజినాల్ అనే సమ్మేళనం ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. దీని వల్ల లివర్ వాపులకు గురి కాకుండా ఆరోగ్యంగా ఉంటుంది. లివర్ కణాలు రక్షించబడతాయి. లవంగాల పాలను రాత్రి పూట నిద్రకు ముందు తాగితే మేలు జరుగుతుంది. అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఉదయం అల్పాహారం తీసుకున్న తరువాత కూడా ఈ పాలను తాగవచ్చు. రక్తాన్ని పలుచగా చేసే మందులను వాడేవారు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, పొట్టలో తరచూ అసౌకర్యం ఏర్పడే వారు, అలర్జీలు ఉన్నవారు ఈ పాలను తాగకూడదు. ఇలా పలు జాగ్రత్తలను పాటిస్తూ ఈ పాలను సేవిస్తుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# కిడ్నీ వ్యాధులపై నీళ్లు చల్లండి



'కిడ్నీల్లో రాళ్లు'.. ఈ సమస్య వినని వాళ్లుండరు. పెరుగుతున్న వాతావరణ ఉష్ణోగ్రతలతో ఈ సమస్యను ఇంకా ఎక్కువసార్లు వినాల్సి రావొచ్చు. ఒకవేళ అనుభవమూ కావొచ్చు. ఇందులో ఆశ్చర్యపోయేదేమీ లేదు. పెరుగుతున్న ఉష్ణోగ్రత, మారుతున్న జీవన శైలి కిడ్నీలను ప్రమాదంలోకి నెడుతున్నాయి. వాతావరణ మార్పులను మానవ మాత్రులు మార్చలేరు కాబట్టి. మనవంతు ప్రయత్నంగా ముందు జాగ్రత్తే మేలంటున్నారు యూరాలజిస్ట్ డాక్టర్. నందకుమార్ మధేకర్. వేడి వాతావరణంలో పనిచేసేవాళ్లు తమను తాము కాపాడుకునేందుకు చల్లని కబురు చెబుతున్నారు. పొడిగా, వేడిగా ఉండే వాతావరణంలో నివసించే వారిలో మూత్రపిండాల్లో రాళ్ల సమస్య ఇతర ప్రాంతాల వారికంటే ఎక్కువగా ఉంటుంది. వాతావరణ ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే అయిదు నుంచి ఏడు డిగ్రీలు అధికంగా ఉన్నట్లయితే.. ఆ ప్రాంతంలో ఉండేవాళ్లలో మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే సమస్యలు 30 శాతం పైగా ఎక్కువగా ఉంటాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ ఉష్ణోగ్రత మధ్యస్థంగా (35 డిగ్రీ సెంటిగ్రేడ్ కన్నా తక్కువ ఉష్ణోగ్రత) ఉండే ప్రదేశం నుంచి వేడి ప్రదేశానికి (35 డిగ్రీ సెంటిగ్రేడ్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రత) వలసవెళ్లి జీవించే వారిలో మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడుతున్నాయి. కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి భౌగోళిక పరిస్థితులకు సంబంధం స్పష్టమవుతున్నది. గ్రామీణ, పట్టణాలలో ఆరుబయట, అధిక వేడి వాతావరణంలో చాలామంది పనిచేస్తుంటారు. కొంతమంది వృత్తి, ఉద్యోగ పనుల్లో పడి నీళ్లు తాగడం నిర్లక్ష్యం చేస్తుంటారు. కొన్ని పని ప్రదేశాల్లో నీళ్లు తాగేందుకు సరైన అవకాశం ఉండదు. టాయ్‌లెట్లు అందుబాటులో లేనప్పుడు, దూర ప్రయాణాలు చేస్తున్నప్పుడు మూత్రం రాకుండా ఉండేందుకు మహిళలు నీళ్లు తాగకుండా ఉంటారు. ఇటువంటి వారిలో మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంది.

## రాళ్ల జాడ చెప్పే నొప్పి

శరీరంలో నీటి పరిమాణం తగ్గడం (డీహైడ్రేషన్) వల్ల మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయి. వాతావరణ ఉష్ణోగ్రత పెరిగినప్పుడు శరీరం నుంచి నీరు చెమట రూపంలో బయటికి పోతుంది. తగినన్ని నీళ్లు తాగితే శరీరం కోల్పోయిన నీరు భర్తీ అవుతుంది. దాహాన్ని నిర్లక్ష్యం చేస్తే శరీరంలో నీరు తగ్గిపోయి డీహైడ్రేషన్‌కు గురవుతారు. శరీరంలో నీరు తక్కువైతే మూత్రం చిక్కబడి ఆమ్ల (యాసిడ్) రూపానికి మారుతుంది. శరీరధర్మ క్రియల తర్వాత వెలువడిన సోడియం, క్యాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫేట్, ఆక్సలేట్స్, యూరిక్ ఆసిడ్ లాంటివి మూత్రపిండాలకు చేరుకుంటాయి. శరీర ద్రవాలు, మూత్రం చిక్కబడటం వల్ల ఇవి కిడ్నీలలో ఉండిపోతాయి. కొంతకాలానికి ఇవి గట్టిపడి స్ఫటికాలుగా మారతాయి. ఇవి క్రమంగా ఒక్కచోటచేరి చిన్న రాళ్లుగా రూపొందుతాయి. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడిన విషయం చాలాకాలం పాటు వ్యక్తి ఎరుకలోకి రాకపోవచ్చు. ఆ రాళ్లు మూత్రపిండాల నుంచి యురేటర్ (మూత్రపిండాలను, మూత్రాశయాన్ని కలిపే నాళం)లోకి జారి మూత్రాన్ని అడ్డుకున్నప్పుడో, ఆ నాళంలో ఇరుక్కొని నొప్పి కలిగినప్పుడో సమస్య ఉందని తెలుస్తుంది. ఇదే సమయంలో వీపులో, పొట్టలో తీవ్రమైన నొప్పి కలుగుతుంది. తరచూ మూత్రానికి వెళ్లాల్సి రావటం, మూత్రం విసర్జించేప్పుడు నొప్పి తలెత్తడం లాంటి లక్షణాలు మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడ్డాయనేందుకు సూచనలుగా చెప్పుకోవచ్చు. కొన్నిసార్లు మూత్రంలో రక్తం పడుతుంది. కడుపులో తిప్పడం, వాంతులు కూడా అవుతాయి.

యూటీఐ ఇన్‌ఫెక్షన్ గుర్తించటం ఎలా?

మూత్రనాళపు ఇన్ఫెక్షన్‌ని ప్రారంభంలోనే గుర్తిస్తే ఇన్ఫెక్షన్ మూత్రపిండాలకు ప్రమాదకరంగా పరిణమించకుండా చేయవచ్చు. కొన్ని స్పష్టమైన లక్షణాల ఆధారంగా యూటీఐ ఇన్‌ఫెక్షన్‌ని తేలిగ్గా గుర్తించవచ్చు.

మూత్ర విసర్జన చేసేటప్పుడు నొప్పి

తరచూ మూత్రానికి వెళ్లాలనిపించడం

విసర్జించే మూత్ర పరిమాణంలో స్వల్పంగా తగ్గుదల

పొట్టదిగువ భాగంలో, వీపులో ఒత్తినట్లుగా అనిపించడం, నొప్పి కలగడం

అకారణంగా అలసట

వణుకుతో కూడిన జ్వరం

యూటీఐ ఇన్‌ఫెక్షన్ సోకినట్లు అనుమానం ఉంటే డాక్టరును సంప్రదించాలి. వ్యాధి నిర్ధారణ అయితే.. వెంటనే చికిత్స చేస్తే యూటీఐ ఇన్‌ఫెక్షన్, కిడ్నీల్లో రాళ్ల సమస్య తొందరగా అదుపులోకి వస్తాయి. సత్వర చికిత్సతో కిడ్నీలకు ప్రమాదం తప్పుతుంది.

నిర్ధారణ-చికిత్స

ఈ లక్షణాలు కనిపించనపుడు ఎక్స్ రే, యూరిన్, సి.టి.స్కాన్, అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించి మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నదీ లేనిది నిర్ధారించవచ్చు. రాళు చిన్నవిగా ఉంటే బయటికి వెళ్లడానికి అవకాశం ఉంటుంది. అప్పుడు కలిగే బాధ నివారణకు మందులు ఇస్తారు. మందులతోపాటు సమృద్ధిగా (రోజుకు కనీసం 3-4 లీటర్ల) నీళ్లు తాగాలి. ఆ విధంగా చేయటం వల్ల మూత్రంతో రాళు బయటికి వెళ్లిపోతాయి. 5 మిల్లీమీటర్లు అంతకన్నా చిన్నవిగా ఉన్న రాళ్లు ఈ విధంగా మూత్రంతోపాటు వెళ్లిపోగలుగుతాయి. అంతకంటే పెద్దవిగా ఉండే రాళ్లను చికిత్స ద్వారా తొలగించవచ్చు.

కఠినమైన రాళ్లను ఈజీగా కరిగించండి!

ఆహార అలవాట్లలో కొద్దిపాటి మార్పులు చేసుకోవటం ద్వారా మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా జాగ్రత్తపడవచ్చు. మార్పులు ఆ సమస్యను పరిష్కరించటమే కాకుండా మూత్రపిండాలు సహా మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవటంలోనూ తోడ్పడతాయి.

నీరే ఔషధం

వేసవిలో ఇంట్లోనే ఉండేవాళ్లు, కార్యాలయాల్లో ఉండి పనిచేసేవాళ్లు రోజులో 3 నుంచి 4 లీటర్ల నీళ్లు తాగాలి. అదే ఆరుబయట పనిచేసే వాళ్లయితే.. 4 నుంచి 5 లీటర్ల నీళ్లు తాగాలి. గంటల తరబడి మూత్రం రాకుండా ఉందంటే ఆ వ్యక్తి తగినన్ని నీళ్లు తాగట్లేదని అర్థం చేసుకోవాలి. ఏడాదిలో ఏ రుతువులోనైనా శరీరానికి కావాల్సినన్ని మంచినీళ్లు తాగాలి. నీళ్లే మూత్రపిండాలను ఆదుకుంటాయి. తినేప్పుడు, దప్పికైనప్పుడు తాగడంతోపాటు, పడుకునే ముందు మంచినీళ్లు తాగటం అలవాటు చేసుకోవాలి. పడుకునే ముందు మంచినీళ్లు తాగితే రాత్రి శరీరానికి తగినంత నీరు అందుతుంది.

నిమ్మరసం తాగండి

వాతావరణం కాస్త వేడిగా ఉందంటే చాలు.. చాలామంది సోడా, ఐస్ టీ, చాక్‌లెట్ షేక్ లాంటివి తాగుతుంటారు. ఇవి రక్తంలో ఆక్సలేట్ అనే యాసిడ్‌ను పెంచుతాయి. ఈ యాసిడ్ మూత్రపిండాలలో రాళ్లు పెరగటానికి కారణమవుతుంది. వీటికి బదులుగా నిమ్మరసం తాగండి. కాలంతో సంబంధం లేకుండా పెరుగుతున్న ఉష్ణోగ్రతను తట్టుకోవడానికి ఇది సాయపడుతుంది. అలాగే మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటాన్ని నిరోధిస్తుంది.

ప్రొటీన్‌కి పరిమితి

మాంసం, చేపలు, గుడ్ల ద్వారా లభించే ప్రొటీన్ వల్ల క్యాల్షియం, యూరిక్ యాసిడ్‌తో రాళ్లు ఏర్పడుతున్నాయి. మాంసాహారంలో ఉండే 'ప్యూరిన్స్' అనే పదార్థాలు జీర్ణక్రియ వల్ల యూరిక్ యాసిడ్స్‌గా విడిపోతాయి. కాబట్టి పోషకాహారమే అయినా దాని పరిమాణం ఎక్కువైతే శరీరంలో ఏర్పడే యూరిక్ యాసిడ్ పరిమాణం కూడా పెరుగుతుంది. ఈ సమస్య రాకుండా ఉండేందుకు మాంసాహారాన్ని పరిమితంగా తినాలి. ఆహార అలవాట్లలో కచ్చితంగా పరిమితి విధించుకోవాలి.

ఉప్పుతో ముప్పు

సాధారణ ఉప్పులో ఉండే సోడియం లవణం వల్ల మూత్రంలో చేరే క్యాల్షియం పరిమాణం పెరుగుతుంది. మూత్రపిండాల్లో చేరిన కాల్షియం ఘనీభవించి రాళ్లుగా మారుతుంది.

కెఫిన్ తగ్గితే మేలు

ఇక కాఫీ, టీ తరుచూ తీసుకుంటూ ఉండటం ద్వారా శరీరానికి అదనంగా నీరు అందిస్తున్నట్లు చాలా మంది భావిస్తారు. కానీ వీటిలో ఉండే కెఫిన్ వల్ల దేహం నీరు కొల్పోయేస్థితి (డీహైడ్రేషన్)కి చేరుతుంది. అందువల్ల టీ-కాఫీలను తగ్గించాలి. వీలైతే మానేయాలి.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001.
APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.